విశాల భారతి
తెలుగు దిన పత్రిక
epaper:vishalabharati.com
శుక్రవారం, హైదరాబాద్ 18.04.2025
24 క్యారెట్లు 92,789.00 | కిలో వెండి 1,07,787.00 | 34 °C | సంపుటి:3 | సంచిక:167
www.vishalabharati.com

# రాష్ట్రపతికే ఆదేశాలిస్తారా?

- సూపర్ పార్లమెంట్'గా వ్యవహరిస్తున్న న్యాయవ్యవస్థ
- ప్రజాస్వామ్యంపై అణ్వస్త్రంగా మారిన ఆర్టికల్ 142
- జడ్జి ఇంట్లో నోట్ల కట్టలు దొరికితే ఇప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు లేదు
- పారదర్శకత, జవాబుదారీతనం తప్పక ఉండాల్సిందే
- న్యాయవ్యవస్థపై ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్ తీవ్ర వ్యాఖ్యలు



విశాలభారతి, నేషనల్ బ్యూరో:

భారత ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ న్యాయవ్యవస్థ పనితీరుపై, సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన కొన్ని తీర్పులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రపతి, గవర్నర్‌లు బిల్లులను ఆమోదించడానికి సుప్రీంకోర్టు గడువు నిర్దేశించడాన్ని, అలాగే ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి నివాసంలో భారీ నగదు పట్టుబడిన ఘటనపై దర్యాప్తు

..మిగతా 2 లో




## రాహుల్ గుజరాత్ వెళ్లగానే
# మోదీ గుండెల్లో దడ

- తప్పులను ఎత్తిచూపుతున్నందుకే కక్ష సాధింపు
- కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్
- పీసీసీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన
- ఈడీ కార్యాలయం ఎదుట ధర్నా

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గుజరాత్‌లో అడుగు పెట్టగానే భాజపా, ప్రధాని మోదీ గుండెల్లో దడ మొదలైందని పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ పేర్కొన్నారు. మోదీ సర్కారు చేస్తున్న తప్పులను ఎత్తిచూపుతూ.. సామాజిక న్యాయం కోసం రాహుల్‌గాంధీ పోరాడుతున్నందుకే ఆయన కుటుంబంపై కేంద్ర పాలకులు

..మిగతా 2 లో



# మద్యం ధరలు పెంపు ?

- జులై నుంచి అమల్లోకి వచ్చే చాన్స్
- సర్కారు ముందు రెండు ప్రతిపాదనలు
- బాటిల్‌పై నిర్దిష్ట మొత్తం పెంపు.. పన్నుల పునర్వ్యవస్థీకరణ
- వార్షికాదాయం రూ.4 వేల కోట్ల వరకు పెరిగే అవకాశం
- సీఎం జపాన్ నుంచి రాగానే నిర్ణయం
- జూన్ 30న లిక్కర్ కంపెనీలతో ముగియనున్న ఒప్పందం

“రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక లోటు భర్తీ కోసం త్వరలో మద్యం ధరలను పెంచడానికి సన్నద్ధమైనట్లు సమాచారం. ఇటీవలే బీర్లపై 15 శాతం ధరలు సర్కారు పెంచిన సంగతి తెలిసిందే. మద్యం ధరల పెంపునకు ప్రభుత్వానికి ఎక్సైజ్‌శాఖ అధికారులు రెండు రకాల ప్రతిపాదనలను సమర్పించారు. మద్యం బాటిల్‌పై రూ.10 చొప్పన పెంచడంతోపాటు పన్నుల విధానాన్ని పునఃసమీక్షించి పన్నులను పునర్వ్యవస్థీకరించాలని సూచించినట్లు సమాచారం.

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

బాటిల్‌పై రూ.10 చొప్పున పెంచితే అదనంగా నెలకు రూ.180 కోట్లు.. పన్నుల పునర్వ్యవస్థీకరణతో బాటిల్‌పై రూ.20 చొప్పున రూ.360 కోట్ల ఆదాయం లభిస్తుందని అంచనాలు రూపొందించారు. దీని ప్రకారం మద్యం అమ్మకాలతో వార్షికాదాయం రూ.2,000 కోట్ల నుంచి రూ.4,000 కోట్ల వరకూ పెరగనున్నది. 202526 ఆర్థిక సంవత్సరంలో మద్యం ద్వారా ఆదాయం రూ.27,600 కోట్లు వస్తుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. చీప్ లిక్కర్ మినహా ప్రీమియర్ బ్రాండ్ల మద్యం ధరలు పెంచాలని యోచిస్తున్న సర్కార్.. ఈ విషయమై త్వరలోనే తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

..మిగతా 2 లో



## ఫ్యూచర్‌సిటీలో...
# రూ.1000 కోట్ల పెట్టుబడులు

- ముందుకొచ్చిన జపాన్ కంపెనీ మారుబెనీ
- జపాన్‌పర్యటనలో సీఎం రేవంత్‌తో ఒప్పందం
- నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు అంగీకారం
- దశలవారీగా 600 ఎకరాల్లో అభివృద్ధి
- 30వేల మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉద్యోగావకాశాలు
- ఫ్యూచర్ సిటీలో ఫస్ట్ ఇండస్ట్రియల్ పార్కు ఇదే
- సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం జపాన్ పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. పర్యటనలో భాగంగా తొలి రోజునే భారీ పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. జపాన్‌కు చెందిన ప్రముఖ వ్యాపార సంస్థ మారుబెనీ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో అత్యాధునిక పారిశ్రామిక పార్క్‌ను ఏర్పాటు చేయడానికి మరుబెనీ రెడీ అయింది. టోక్యోలో మారుబెనీ ప్రతినిధులు

..మిగతా 2 లో

## పుప్పాలగూడలో
# ఐటీ నాలెడ్జ్ హబ్

- 450 ఎకరాల్లో ఏర్పాటుకు సత్వర చర్యలు
- గతంలో ప్రజాప్రతినిధులు, ఐఏఎస్‌లకు ఇచ్చిన 200 ఎకరాలు
- పారిశ్రామికాభివృద్ధి సంస్థకు చెందిన మరో 250 ఎకరాలు గుర్తింపు
- ఈ 450 ఎకరాల్లో మొదటి దశ నాలెడ్జి హబ్ ఏర్పాటు
- అధికారులను ఆదేశించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

హైదరాబాద్ శివార్లలోని పుప్పాలగూడలో 450 ఎకరాల్లో ఐటీ నాలెడ్జ్ హబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. మొదటి దశ కింద 450 ఎకరాల్లో ఏర్పాటుకు

..మిగతా 2 లో



# ముంబై చేతిలో సన్ రైజర్స్ చిత్తు..

- 4 వికెట్ల తేడాతో ఓటమి
- ప్లే ఆఫ్ ఆశలు సంక్లిష్టం
- సొంత గడ్డపై అదరగొట్టిన ముంబై

3 లో

# వక్ఫ్ ఆస్తుల జోలికి వెళ్లం

- బోర్డులు, కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లో నియామకాలూ చేపట్టం
- తదుపరి విచారణ వరకు యథాతథ స్థితి
- సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం హామీ
- కొత్త చట్టంపై స్టే ఇవ్వొద్దని అభ్యర్థన
- అంగీకరించిన ధర్మాసనం
- తదుపరి విచారణ మే 5వ తేదీకి వాయిదా



విశాలభారతి, నేషనల్ బ్యూరో:

తదుపరి విచారణ వరకు వక్ఫ్ ఆస్తుల జోలికి వెళ్లబోమని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. వక్ఫ్ సవరణ చట్టంపై ఎలాంటి స్టే ఇవ్వొదని అభ్యర్థించింది. ఈ చట్టానికి వ్యతిరేకంగా నమోదైన పిటిషన్లపై, సుప్రీంకోర్టు లేవనెత్తిన అభ్యంతరాలపై సమాధానం ఇచ్చేందుకు వారం రోజులు గడువు ఇవ్వాలని కోరింది. దీనికి అంగీకరించిన కోర్టు.. తదుపరి విచారణను వచ్చే నెల 5వ తేదీకి వాయిదా వేసింది.

వక్ఫ్ సవరణ చట్టంలోని పలు సెక్షన్లను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో 72కుపైగా పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. వాటిపై చీఫ్ జస్టిస్

..మిగతా 2 లో

## సర్కార్‌ను పడగొట్టే
# కర్మ మాకేంటి?

- ప్రజలే రోడ్లపైకొచ్చి ప్రభుత్వాన్ని కూలగొడతారు
- సిగ్గూశరం లేకనే రేవంత్ రాజీనామా చేయలేదు
- కొందరు పోలీసుల తీరుపై సుప్రీంకోర్టుకు వెళ్తాం
- పర్యావరణ ధ్వంసంపై విచారణ చేపట్టాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత కేటీఆర్



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తమకు రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూల్చాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. బంగ్లాదేశ్ తరహాలో

..మిగతా 2 లో




# గ్రూప్–1 నియామకాలకు బ్రేక్

- ప్రస్తుతానికి అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ఇవ్వొద్దు
- మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయంటూ పిటిషన్
- మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు
- విచారణ తేలేవరకూ ప్రక్రియ ఆపాలని ఆదేశాలు
- తదుపరి విచారణ ఏప్రిల్ 28కి వాయిదా

3 లో

## ఇద్దరు పిల్లలను నరికి చంపి.. తల్లి ఆత్మహత్య

విశాలభారతి, స్టేట్ బ్యూరో: మేడ్చల్ జిల్లా గాజులరామారంలో దారుణం చోటు చేసుకుంది. ఓ తల్లి తన ఇద్దరు కుమారులను చంపి తర్వాత ఆమె ఆత్మహత్య చేసుకుంది. 7, 5 ఏళ్ల వయసున్న ఇద్దరు కుమారులను తల్లి కొబ్బరి బోండాల కత్తితో నరకడంతో వారు మృతి చెందారు. ఆ తర్వాత తల్లి భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనతో గాజులరామారంలో విషాదచాయలు అలుముకున్నాయి. కళ్ల ముందు ఆడుతూ ఉండే పిల్లలు తల్లి చేతిలో హత్యకు గురి కావడంతో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. తేజస్విని రెడ్డి అనే మహిళ తన ఇద్దరు కుమారులను కొబ్బరి బోండాల కత్తితో మెడపై నరికి పాశవికంగా అంతం చేసింది. అనంతరం ఐదంతస్తుల అపార్ట్‌మెంట్ భవనం మీద నుంచి కిందకు దూకడం కలకలం రేపింది. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీ లేఅవుట్‌లో ఈ సంఘటన జరిగింది. సహస్ర హైట్స్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న తేజస్విని రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి దంపతులకు అర్షిత్ రెడ్డి (6), ఆశిష్ రెడ్డి (8) అనే ఇద్దరు కుమారులున్నారు. గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో తేజస్విని తన ఇద్దరు కుమారులను కొబ్బరి బొండాలు కొట్టే కొడవలితో మెడపై నరికింది. ఈ ఘటనలో ఆశిష్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, అర్షిత్ రెడ్డిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనా స్థలంలో పోలీసులు 5 పేజీల సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులో అనారోగ్య కారణాల వలన ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు ఉందని సమాచారం.



# మద్యం ధరలు పెంపు ?

తరువాయి భాగం

పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో చీప్ లిక్కర్ ధర ఎక్కువగా ఉంది. ఇంకా ధరలు పెంచితే చీప్ లిక్కర్ వ్యాపారం కుప్పకూలిపోతుందని దీనికితోడు పొరుగు రాష్ట్రాల నుంచి ఎన్డీపీఎల్ మద్యం, ఫేక్ లిక్కర్ అక్రమ రవాణా పెరిగిపోతుందని ఎక్సైజ్ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చీప్ లిక్కర్ ధరలను నియంత్రణలో ఉంచాలని ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ సూచించినట్టు తెలిసింది. ధరలు పెంచకుండా ప్రభుత్వ ఆదాయం పెరిగేలా కర్ణాటక తరహాలో టెట్రా ప్యాకెట్లను ప్రవేశ పెట్టాలని ఆయన సూచించినట్టు తెలిసింది. దీని ద్వారా ప్రతి క్వార్టర్ మీద కనీసం రూ.15 నుంచి రూ.20 వరకు తగ్గుతాయని పేర్కొన్నట్టు సమాచారం.

రెండు స్లాబుల్లో లికర్ ధరలను పెంచే సూచనలతో కూడిన నివేదికను సీఎం రేవంత్‌రెడ్డికి అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. చీప్ లిక్కర్ బ్రాండ్లను యథాతథంగా ఉండనిచ్చి మిగిలిన మూడు క్యాటగిరీల లిక్కర్‌పై ధరలు పెంచాలని ప్రతిపాదించినట్టు తెలిసింది. న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు ధరల నిర్ణయ కమిటీ 15 శాతం నుంచి 20 శాతం వరకు ధరలు పెంచవచ్చని ప్రభుత్వానికి నివేదించినట్టు తెలిసింది.

# రాష్ట్రపతికే ఆదేశాలిస్తారా ?

తరువాయి భాగం

జరుగుతున్న తీరును ఆయన బహిరంగంగా ప్రశ్నించారు. రాజ్యసభ ఇంటర్న్‌ల ఆరవ బ్యాచ్‌ను ఉద్దేశించి ప్రసంగించిన ధన్‌ఖడ్, ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ, రాష్ట్రపతికి కోర్టులు ఆదేశాలు జారీ చేసే పరిస్థితి ఉండకూడదని అన్నారు. "రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని, సంరక్షిస్తానని, కాపాడతానని ప్రమాణం చేసిన రాష్ట్రపతి అత్యంత ఉన్నత స్థానంలో ఉంటారు. అలాంటిది ఇటీవల ఒక తీర్పు ద్వారా రాష్ట్రపతికి ఆదేశాలు జారీ అయ్యాయి. మనం ఎటువైపు వెళుతున్నాం? దేశంలో ఏం జరుగుతోంది?" అని ప్రశ్నించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 (సుప్రీంకోర్టుకు ప్రత్యేక అధికారాలు) న్యాయవ్యవస్థ చేతిలో 24 గంటలూ అందుబాటులో ఉండే 'అణు క్షిపణి'గా మారిందని, ఇది ప్రజాస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా ఉందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. న్యాయమూర్తులే చట్టాలు చేసే, కార్యనిర్వాహక విధులు నిర్వర్తించే, సూపర్ పార్లమెంటుగా వ్యవహరించే పరిస్థితి ఏర్పడుతోందని, వారికి చట్టం వర్తించకపోవడంతో జవాబుదారీతనం లోపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. శాసనసభ రెండోసారి ఆమోదించిన బిల్లులపై రాష్ట్రపతి లేదా గవర్నర్ నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని, లేదంటే అవి చట్టాలుగా పరిగణించబడతాయని సుప్రీంకోర్టు తమిళనాడు కేసులో ఇటీవల పేర్కొన్న నేపథ్యంలో ఉపరాష్ట్రపతి ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రపతి విధులు కూడా ఆర్టికల్ 201 ప్రకారం న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయని ఆ తీర్పులో ధర్మాసనం పేర్కొంది.

మార్చి 1415 తేదీల్లో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి నివాసంలో భారీగా నగదు పట్టుబడిన ఘటనను కూడా ధంకర్ ప్రస్తావించారు. ఈ ఘటన మార్చి 21న ఒక పత్రిక కథనంతో గానీ వెలుగులోకి రాలేదని, ఈ జాప్యం ఆమోదయోగ్యమేనా అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు నుంచి అధికారిక సమాచారం వచ్చిందని, అది తప్పు జరిగిందనే సూచనలు ఇచ్చిందని, విచారణ అవసరాన్ని నొక్కి చెప్పిందని అన్నారు. అయితే, నెల రోజులు గడిచినా ఈ కేసులో పురోగతి లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

"ఈ దేశంలో ఎవరిపైనైనా, నాతో సహా ఏ రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిపైనైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయవచ్చు. కానీ న్యాయమూర్తుల విషయంలో మాత్రం నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేని పరిస్థితి ఉంది" అని ధన్‌ఖడ్ అన్నారు. రాజ్యాంగం ప్రకారం విచారణ నుంచి మినహాయింపు కేవలం రాష్ట్రపతి, గవర్నర్లకు మాత్రమే ఉందని, న్యాయమూర్తులకు ఈ రక్షణ ఎలా లభించిందని ఆయన ప్రశ్నించారు. "ఈ ఘటన నా ఇంట్లో జరిగి ఉంటే, దర్యాప్తు రాకెట్ వేగంతో జరిగేది. కానీ ఇప్పుడు కనీసం ఎడ్లబండి వేగంతో కూడా సాగడం లేదు" అని ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు.



# రూ.1000 కోట్ల పెట్టుబడులు

తరువాయి భాగం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. ఫ్యూచర్ సిటీలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు, పెట్టుబడుల గురించి చర్చించారు.

మారుబెనీ సంస్థ దాదాపు రూ. 1,000 కోట్ల పెట్టుబడితో ఈ ప్రాజెక్టును మొదలు పెట్టనుంది. ఫ్యూచర్ సిటీలో 600 ఎకరాల్లో ఈ పార్క్‌ను అభివృద్ధి చేస్తారు. దీనికి సంబంధించిన ఒప్పందంపై ముఖ్యమంత్రి సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, మారుబెనీ ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ ఇండస్ట్రియల్ పార్క్‌లో జపాన్, ఇతర దేశాల కంపెనీలు తమ తయారీ యూనిట్లను ఏర్పాటు చేస్తాయి. దీని ద్వారా దాదాపు రూ. 5,000 కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. మారుబెనీ ఇండస్ట్రియల్ పార్క్ ప్రధానంగా ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఫార్మా, ప్రెసిషన్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలపై దృష్టి పెడుతుంది.

ఫ్యూచర్ సిటీలో మారుబెనీ పెట్టుబడులు పెట్టడం సంతోషంగా ఉందని సీఎం రేవంత్ ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ పార్క్ ఫ్యూచర్ సిటీలో అభివృద్ధి చేసే మొదటి ప్రాజెక్ట్ అవుతుందన్నారు. దీని ద్వారా తెలంగాణలో దాదాపు 30,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు వస్తాయని అన్నారు. తెలంగాణలో వ్యాపారం చేయడానికి చాలా మంచి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. మారుబెనీకి ప్రభుత్వం అన్ని విధాలా సహాయం చేస్తుందని హామీ ఇచ్చారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ భారతదేశంలోనే మొదటి నెట్ జీరో సిటీగా అభివృద్ధి చెందుతుందన్నారు. కాగా, మారుబెనీ ప్రపంచవ్యాప్తంగా 65 దేశాలలో 410కి పైగా గ్రూప్ కంపెనీల ద్వారా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆహారం, వ్యవసాయ ఉత్పత్తులు, లోహాలు, గనులు, ఇంధనం, విద్యుత్, కెమికల్స్, మౌలిక సదుపాయాలు, ఫైనాన్స్ లీజింగ్, రియల్ ఎస్టేట్, ఏరోస్పేస్, మొబిలిటీ వంటి రంగాలలో ఈ కంపెనీ అగ్రగామిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 50,000 మంది ఉద్యోగులను నియమించుకుంది.

# వక్ఫ్ ఆస్తుల జోలికి వెళ్లం

మొదటిపేజీ తరువాయి

సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల త్రిసభ్య ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. అయితే పిటిషన్లలో లేవనెత్తిన అభ్యంతరాలు, ధర్మాసనం లేవనెత్తిన ప్రశ్నలపై సమాధానం ఇచ్చేందుకు వారం రోజులు గడువు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యర్థించారు. ఈ క్రమంలో వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయకుండా, ముస్లిమేతరులను వక్ఫ్ బోర్డులు, కేంద్ర కౌన్సిల్‌లో సభ్యులుగా నియమించకుండా చట్టంలోని ఆయా సెక్షన్లపై స్టే ఇచ్చేందుకు ధర్మాసనం సిద్ధమైంది. దీనిని సొలిసిటర్ జనరల్ వ్యతిరేకించారు. పార్లమెంటులో విస్తృతంగా చర్చించి, మెజారిటీ సభ్యుల ఆమోదంతో కేంద్రం వక్ఫ్ సవరణ చట్టం చేసిందని.. ప్రభుత్వ వాదనలు వినకుండా స్టే ఇవ్వడం సరికాదని వాదించారు.

ప్రైవేటు ఆస్తులను వక్ఫ్‌గా ప్రకటించారంటూ దేశవ్యాప్తంగా లక్షల కొద్దీ విజ్ఞప్తులు రావడం వల్లే పార్లమెంటు వక్ఫ్ చట్టాన్ని సవరించిందని వివరించారు. కేవలం ఆయా సెక్షన్లను పైపైన చదివి చర్యలు తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. వారం గడువు ఇవ్వడం వల్ల వక్ఫ్ ఆస్తులకు వచ్చే ముప్పేమీ ఉండదని.. స్టే ఇవ్వడం వంటి కఠిన చర్యలు చేపట్టవద్దని విజ్ఞప్తి చేశారు. వక్ఫ్ సవరణ చట్టంలోని పలు సెక్షన్లను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో 72కుపైగా పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. వాటిపై చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల త్రిసభ్య ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. అయితే పిటిషన్లలో లేవనెత్తిన అభ్యంతరాలు, ధర్మాసనం లేవనెత్తిన ప్రశ్నలపై సమాధానం ఇచ్చేందుకు వారం రోజులు గడువు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యర్థించారు. ఈ క్రమంలో వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయకుండా, ముస్లిమేతరులను వక్ఫ్ బోర్డులు, కేంద్ర కౌన్సిల్‌లో సభ్యులుగా నియమించకుండా చట్టంలోని ఆయా సెక్షన్లపై స్టే ఇచ్చేందుకు ధర్మాసనం సిద్ధమైంది. దీనిని సొలిసిటర్ జనరల్ వ్యతిరేకించారు.

సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలతో సంతృప్తి చెందని ధర్మాసనం.. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికే మొగ్గు చూపింది. ప్రస్తుతం పరిస్థితి వేరుగా ఉందని, సమస్యలు కనిపిస్తున్నాయని పేర్కొంది. దీనితో తదుపరి విచారణ వరకు వక్ఫ్ ఆస్తుల జోలికి వెళ్లబోమని కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ హామీ ఇచ్చారు. దీనిని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుని స్టే పై వెనక్కి తగ్గింది. ''తదుపరి విచారణ వరకు 'వక్ఫ్ బై యూజర్', బోర్డులు సహా ఎలాంటి వక్ఫ్ ఆస్తులను డీ నోటిఫై చేయబోమని సొలిసిటర్ జనరల్ హామీ ఇచ్చారు. సవరణ చట్టంలోని 9, 14 సెక్షన్ల కింద ఎలాంటి నియామకాలు చేపట్టబోమని, ముస్లిమేతరులను వక్ఫ్ బోర్డులు, కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లో నియమించబోమని చెప్పారు. ఈ అంశాలను నమోదు చేసుకుంటున్నాం'' అని ధర్మాసనం పేర్కొంది. కౌంటర్ దాఖలు చేయడానికి వారం రోజులు గడువు ఇస్తున్నామని తెలిపింది. ప్రభుత్వం కౌంటర్ వేశాక.. దానిపై ఐదు రోజుల్లోగా రిజాయిండర్లు వేయాలని పిటిషనర్లకు సూచించింది. పిటిషన్లు ఎక్కువ సంఖ్యలో ఉన్న నేపథ్యంలో అందులో ఐదింటిలోనే వాదనలు వింటామని ధర్మాసనం తెలిపింది. ఇందుకోసం ముగ్గురు న్యాయవాదులను నోడల్ కౌన్సెల్‌గా నియమిస్తామని, ఎవరెవరు అందులో ఉండి వాదనలు వినిపిస్తారో మీరే నిర్ణయించుకోండి అని సూచించింది. విచారణను మే 5వ తేదీకి వాయిదా వేసింది.



# సర్కార్‌ను పడగొట్టే కర్మ మాకేంటి?

తరువాయి భాగం

ప్రజలే స్వయంగా రోడ్లపైకి వచ్చి ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపుతారని ఆయన అన్నారు. ఎందరో నియంతలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి పూర్తికాలం ముఖ్యమంత్రిగా కొనసాగాలని ఆకాంక్షించారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలతో మరొక ముఖ్యమంత్రి అయితే రాజీనామా చేసేవారని అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిరికిపంద అని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాడని దర్శనం వెంకటయ్య అనే దళితుడిని అక్రమంగా జైలుకు పంపారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే భద్రత లేకుండా తెలంగాణలోని ఏ ఊరికైనా రావొచ్చని సవాల్ విసిరారు. ప్రజలు ఈ పాలన గురించి ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలని సూచించారు. రేవంత్ రెడ్డి విదేశాల్లో విలాసయాత్రలు చేస్తుంటే ప్రజలు తప్పకుండా ఆగ్రహిస్తారని, నిందిస్తారని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజాస్వామిక స్ఫూర్తి అవసరమని హితవు పలికారు.

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ)కు సంబంధించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ. 10 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిందని కేటీఆర్ పునరుద్ఘాటించారు. ఈ కుంభకోణం వెలుగులోకి రావాలంటే ఆర్బీఐ కూడా విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. సీబీసీ, సీబీఐ కూడా జోక్యం చేసుకోవాలని కోరారు.

కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆవేదనను తాను విన్నానని, వారి ఆవేదన నిజమే అయితే తెలంగాణలోని ఆర్థిక దోపిడీపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఫార్ములా ఈరేసింగ్ కేసులో తనపై నిరాధార ఆరోపణలు చేసినప్పుడు, తాను విధానపరమైన నిర్ణయం తీసుకున్నానని స్పష్టంగా చెప్పానని, కానీ అధికారులను బలిపశువులను చేయలేదని అన్నారు. ఈ విషయంలో విధానపరమైన నిర్ణయానికి బాధ్యత తనదేనని అన్నారు. మంచి జరిగితే తనది, చెడు జరిగితే అధికారులది అని చెప్పే సంస్కృతి తనకు లేదని అన్నారు.

హెచ్‌సీయూ భూవివాదంపై రేవంత్ రెడ్డి కూడా అదే విధంగా స్పందించాలని కోరారు. తనది కాని భూమిని తాకట్టు పెట్టి టీజీఐఐసీ రుణం తీసుకోవడం తప్పు కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో అధికారులు బలి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# రాహుల్ గుజరాత్ వెళ్లగానే మోదీ గుండెల్లో దడ

తరువాయి భాగం

రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీల పేర్లను చేర్చడాన్ని నిరసిస్తూ ఏఐసీసీ పిలుపుమేరకు పీసీసీ గురువారం బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించింది. ముందుగా గన్‌పార్కు నుంచి ఈడీ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. మోదీకి, ఈడీకి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో మీనాక్షి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, సంపత్‌కుమార్, సీడబ్ల్యూసీ సభ్యులు వంశీచంద్‌రెడ్డి, పీసీసీ మాజీ అధ్యక్షుడు వీహెచ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీనాక్షి మాట్లాడుతూ.. 'అహ్మదాబాద్‌లో సీడబ్ల్యూసీ సమావేశాలు జరిగిన తర్వాత నుంచే మోదీ సర్కారు ఈడీతో నోటీసులు ఇప్పిస్తూ వేధింపులకు పాల్పడుతోంది. మోదీ పాలనలో దేశంలో కుల వివక్ష పెరుగుతోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లింలు, సిక్కులను చిన్నచూపు చూస్తున్నారు. తెలంగాణలో చేసిన కులగణన, ఎస్సీ వర్గీకరణ దేశం మొత్తం జరగాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేస్తున్నారు. నేషనల్ హెరాల్డ్‌లో డబ్బుల లావాదేవీలే లేనప్పుడు మనీలాండరింగ్ ఎలా జరుగుతుంది? రాహుల్‌ను ప్రధాని చేసే వరకు పోరాటం కొనసాగిస్తాం' అని ఆమె పేర్కొన్నారు.

**రాహుల్‌కు అండగా దేశ ప్రజలు: భట్టి**

'త్వరలో జరగబోయే ఎన్నికల్లో గుజరాత్‌కు వస్తున్నాం కాచుకో నరేంద్ర మోదీ' అని రాహుల్ చేసిన సవాల్‌కు భయపడి, అక్రమ కేసులతో వేదిస్తోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. 'నేషనల్ హెరాల్డ్ పత్రికలో పనిచేస్తున్న జర్నలిస్టుల జీతాలకు, కరెంట్ బిల్లులకు చందాలు వేసుకుని డబ్బులు ఇస్తే కేసులు పెట్టడం న్యాయమా? దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తప్పుడు కేసులు పెట్టే సంస్థలు, వ్యవస్థలను ప్రక్షాళన చేస్తాం' అని అన్నారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. కేంద్రం దాని వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని, 12 ఏళ్ల కిందటి కేసును ఇప్పుడు తెరపైకి తీసుకురావడం వెనకున్న ఆంతర్యమేంటి? అని ప్రశ్నించారు. దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. మోదీ, అమిత్ షా డైరెక్షన్‌లోనే ఈడీ ఛార్జిషీటు దాఖలు చేసిందని ఆరోపించారు. పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ప్రజాదరణ పొందుతుంటే భాజపా ఓర్వలేకపోతోందన్నారు.



# పుప్పాలగూడలో ఐటీ నాలెడ్జ్ హబ్

తరువాయి భాగం

వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. గతంలో ప్రభుత్వం ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్‌లు, ఐపీఎస్, రెవెన్యూ అధికారులకు, స్పెషల్ పోలీసు మ్యూచువల్ కో ఆపరేటివ్ సొసైటీకి కేటాయించిన 200 ఎకరాలతో పాటు, పారిశ్రామికాభివృద్ధి సంస్థకు చెందిన మరో 250 ఎకరాల స్థలంలో ఐటీ నాలెడ్జ్ హబ్‌ను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

గురువారం సాయంత్రం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పరిశ్రమలు, రెవెన్యూ శాఖల కీలక అధికారులతో మంత్రులు సమావేశమయ్యారు. పుప్పాలగూడలో భూముల లభ్యతపై అధికారులు వివరించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్, ఐపీఎస్, రెవెన్యూ అధికారులకు కేటాయించిన భూములను సుప్రీంకోర్టు రద్దు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. సొసైటీలకు కేటాయించిన భూముల పక్కనే ఇండ్రస్టియల్ కార్పొరేషన్‌కు సంబంధించిన సుమారు 250 ఎకరాల భూమి ఉందని తెలిపారు. మొత్తంగా 450 ఎకరాలు అందుబాటులో ఉందని వివరించారు. చెప్పారు. మొదటి దశలో ఏర్పాటు చేయబోతున్న ఐటీ హబ్ ద్వారా 5 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని వెల్లడించారు.

**ప్రత్యామ్నాయంగానేనా..?**

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ)ను అనుకుని ఉన్న 400 ఎకరాల భూమిని అభివృద్ధి చేసి 5 లక్షల మందికి ఉపాధి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించగా, దానిపై వివాదాలు చుట్టుముట్టిన విషయం తెలిసిందే. ఈ వివాదంపై విచారణ జరుపుతున్న సుప్రీంకోర్టు.. కంచ గచ్చిబౌలి భూముల్లో 100 ఎకరాల్లో తొలగించిన చెట్ల స్థానంలో మళ్లీ వృక్షాల పెంపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో దీనికి ప్రత్యామ్నాయంగా అత్యవసరంగా ప్రభుత్వం పుప్పాలగూడలో నాలెడ్జ్ హబ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం.



# భీమ్‌గల్ పోలీస్ స్టేషను పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్

- పి.సాయి చైతన్య ఐ.పి.యస్

బాల్కొండ,విశాలభారతి:

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఐ.పి.యస్ గురువారం భీమ్‌గల్ పోలీస్ స్టేషన్ ను పర్యవేక్షించారు.పోలీస్ సిబ్బంది ద్వార గౌరవ వదనం స్వీకరించారు .ఈ సందర్బంగా ఆయన పోలీస్ స్టేషన్ ను, వాహనాల పార్కింగ్ స్థలాన్ని మొత్తం కలియ తిరిగి పోలీస్ స్టేషన్ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు.రిసిప్షన్ సెంటర్, కంప్యూటర్ సిబ్బంది పని తీరును అడిగి తెలుసుకున్నారు.5ఎస్ విధానం అమలు చేస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.ప్రధానంగా ఎక్కువ ప్రమాదాలు ద్విచక్ర వాహనాదారులకు జరుగుతున్నందున,తప్పనిసరి హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని సూచించారు. గంజాయి నిర్మూలనకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎవరైన గంజాయికి బానిస అవుతే వారికి కౌన్సిలింగ్ చేయాలని తెలిపారు.దాని నిర్మూలనకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు.సైబర్ మోసల నుండి ప్రజలను మోసపోకుండా అప్రమత్తం చేయాలని సూచించారు.గెమింగ్ అప్ ల పట్ల ప్రజలు మోసపోకుండా ఎప్పటికప్పుడు వారికీ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.సిబ్బంది సాధక బాధలను ఆయన అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏ.సి.పి వెంకటేశ్వర్లు,ఆర్మూర్ రూరల్ సి.ఐ.శ్రీధర్ రెడ్డి,భీమ్‌గల్ సి.ఐ.సత్యనారాయణ,భీమ్‌గల్ ఎస్.ఐ మహేష్,కమ్మర్పల్లి ఎస్.ఐ అనిల్ కుమార్,ఎర్గట్ల ఎస్.ఐ రాము,మోర్తాడ్ ఎస్.ఐ విక్రమ్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటానికి కేసీఆర్ సిద్ధం

విశాలభారతి, ఎల్కతుర్తి:

బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయండని మాజీ మంత్రివర్యులు కొప్పుల ఈశ్వర్ మాజీ శాసనసభ్యులు వోడితల సతీష్ కుమార్ ఎమ్మెల్సీ రవీందర్ రావు వరంగల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం పిలుపునిచ్చారు.ఎల్కతుర్తి మండల కేంద్రంలోని చింతలపల్లి వద్ద భారీ బహిరంగ సభ పనులను పరిశీలించిన కొప్పుల ఈశ్వర్ సతీష్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్షలాదిమంది రాబోవు ఈ సభ కోసం అన్ని రకాల వసతులు ఏర్పాటు చేస్తున్నాము పార్కింగ్ మరియు తాత్కాలిక అంబులెన్స్ సౌకర్యం 20 పడకల హాస్పిటల్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు 33 జిల్లాల ప్రజలు స్వచ్ఛందంగా సభకు వస్తాం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వంచిస్తుంది మళ్ళీ మాకు కేసీఆర్ పాలన కావాలి కేసిఆర్ ప్రభుత్వమే రావాలి బిఆర్ఎస్ ప్రభుత్వంతోనే మాకు న్యాయం జరుగుతది అని ప్రజలు స్వచ్ఛందంగా బహిరంగ సభకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు అనంతరం సతీష్ కుమార్ మాట్లాడుతూ సభా పనులు వేగంగా జరుగుతున్నాయి సభ కోసం వచ్చే కార్యకర్తలకు అన్ని రకాల సదుపాయాలు చేస్తున్నట్లు తెలిపారు 10 లక్షల వాటర్ బాటిల్ 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లు అందించేందుకు సిద్ధం చేస్తున్నామన్నారు భూములు ఇచ్చిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పిట్టల మహేందర్ మండల సీనియర్ నాయకులు తంగేడ మహేందర్ తంగేడ నగేష్ కడారి రాజు గోల్లే మహేందర్ సూరంపల్లి పరశురాం గుండేటి సతీష్ నేత కొమ్మిడి మహిపాల్ రెడ్డి జూపాక జడ్సన్ సాతూరి శంకర్ మదార్ ఈర కమలాకర్ కుర్ర సాంబమూర్తి గౌడ్ మదన్ మోహన్ రావు వేముల శ్రీనివాస్ దుకిరే రాజేశ్వర్ రావు శివాజీ సతీష్ బొంకురి కార్తీక్ భగవాన్ అనిల్ మురళి తదితరులు పాల్గొన్నారు

# ముంబై చేతిలో సన్ రైజర్స్ చిత్తు..

- 4 వికెట్ల తేడాతో ఓటమి
- ప్లే ఆఫ్ ఆశలు సంక్లిష్టం
- సొంత గడ్డపై అదరగొట్టిన ముంబై

విశాలభారతి, స్పోర్ట్స్ బ్యూరో:



ఐపీఎల్ 2025 లో సన్ రైజర్స్ మరో పరాజయాన్ని మూట కట్టుకుంది. గురువారం (ఏప్రిల్ 17) వాంఖడే వేదికగా ముంబై ఇండియన్స్ చేతిలో 4 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడింది. మొదట బ్యాటర్లు విఫలం కాగా.. సాధారణ లక్ష్య ఛేదనలో బౌలర్లు పూర్తిగా చేతులెత్తేశారు. మరోవైపు ముంబై సొంతగడ్డపై అదరగొట్టింది. అన్ని విభాగాల్లో అదరగొట్టి వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. విల్ జాక్స్ 36 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. మొదట బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 162 పరుగులు మాత్రమే చేయగలిగింది. లక్ష్య ఛేదనలో ముంబై 18.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 166 పరుగులు చేసి గెలిచింది. 163 పరుగుల డీసెంట్ టార్గెట్ తో బరిలోకి దిగిన ముంబైకి ఓపెనర్ రోహిత్ శర్మ ప్రారంభంలో మెరుపులు మెరిపించాడు. తొలి రెండు ఓవర్లలో 7 పరుగులే వచ్చినప్పటికీ.. షమీ వేసిన మూడో ఓవర్లో రెండు సిక్సర్లు బాదాడు. నాలుగో ఓవర్లో కమ్మిన్స్ బౌలింగ్ లో మరో సిక్సర్ బాదిన రోహిత్ 16 బంతుల్లో 26 పరుగులు చేసి ఔటయ్యాడు. పవర్ ప్లే తర్వాత 31 పరుగులు చేసిన రికెల్ టన్ ఔటయ్యాడు. ఈ దశలో విల్ జాక్స్ (36), సూర్య (26) భారీ భాగస్వామ్యంతో జట్టును విజయం దిశగా నడిపించారు. వీరిద్దరూ స్వల్ప వ్యవధిలో ఔటైనా కెప్టెన్ హార్దిక్ పాండ్య(21), తిలక్ వర్మ (17) మిగతా లాంఛనాన్ని పూర్తి చేశారు. సన్ రైజర్స్ బౌలర్లలో కమ్మిన్స్ మూడు.. మలింగ రెండు.. హర్షల్ పటేల్ ఒక వికెట్ పడగొట్టారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ హైదరాబాద్ అంచనాలకు మించి రాణించలేకపోయింది. ముంబై బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో మన బ్యాటర్ల వద్ద సమాధానమే లేకుండా పోయింది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 162 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఓపెనర్ అభిషేక్ శర్మ 40 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. ముంబై బౌలర్లలో జాక్స్ రెండు వికెట్లు పడగొట్టాడు. జాక్స్, బోల్ట్, పాండ్య తలో వికెట్ తీసుకున్నారు.


విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
18.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com




## జేఈఈ మెయిన్ ఫలితాలపై గందరగోళం

విశాలభారతి, నేషనల్ బ్యూరో:

జాతీయస్థాయి సాంకేతిక విద్యా సంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(మెయిన్) సెషన్-2 ఫలితాలపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) విద్యార్థులను తీవ్ర నిరాశకు గురిచేసింది. షెడ్యూల్ ప్రకారం గురువారం ఫలితాలు విడుదల చేస్తామని ప్రకటించింది. అయితే ఉదయం నుంచి రాత్రి వరకు విద్యార్థులకు ఎటువంటి అప్‌డేట్ ఇవ్వని ఎన్టీఏ.. ఫలితాల విడుదలలో దోబూచులాడింది. సాయంత్రం తుది ఆన్సర్ కీ విడుదల చేసినట్టే చేసి, కొద్దిసేపటికే వెబ్‌సైట్ నుంచి తొలగించింది. ఫలితాల విడుదల, ఆన్సర్ కీలపై అప్‌డేట్ లేకుండా విద్యార్థులను గందరగోళానికి గురిచేయడంతో దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి.

# భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి 'భూ భారతి' చట్టం దోహదం

- అవగాహన సదస్సులలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

బాల్కొండ,విశాలభారతి





రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి 'నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి ఎంతగానో దోహదపడుతుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు.నిజామాబాద్ జిల్లా కమ్మర్పల్లి,మోర్తాడ్ మండల కేంద్రాలతో పాటు,ఏర్గట్ల మండలం బట్టాపూర్ లో భూభారతి నూతన చట్టంపై రైతులకు గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు.ఈ సదస్సులలో కలెక్టర్ పాల్గొని భూ భారతి చట్టంపై,అందులోని అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తూ రైతులకు సవివరంగా అవగాహన కల్పించారు.ఎలాంటి వివాదాలకు తావు లేకుండా రైతులకు సంబంధించిన భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం ఆనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని వివరించారు.భూమి హక్కుల భద్రత,భూ సమస్యల సత్వర పరిష్కారం,రైతుల మేలు కోసం చారిత్రక మార్పు దిశగా ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం ఉపకరిస్తుందని,రైతుల భూములకు భరోసా లభిస్తుందని సూచించారు.భూ సమస్యల పరిష్కారానికి వెసులు బాటు కల్పించే ఈ చట్టంపై అవగాహనను ఏర్పర్చుకోవాలని, భూ సమస్యలు కలిగిన రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు.పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని నాలుగు మండలాలలో దీనిని ఈ నెలాఖరు వరకు ప్రయోగాత్మకంగా అమలు చేస్తారని,క్షేత్రస్థాయిలో ప్రభుత్వం దృష్టికి వచ్చే ఇతర ఏవైనా అంశాలు,సమస్యలను కూడా పరిశీలించి ఈ చట్టంలో చేర్చడం జరుగుతుందని తెలిపారు. గతంలో ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే అప్పీల్ వ్యవస్థ లేదని సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆర్డీఓ,కలెక్టర్,సీసీఎల్ఏ స్థాయిలలో అప్పీల్ వ్యవస్థ ఉందని,ప్రతి అంశం భూభారతి పోర్టల్ లో ఉంటుందని,ఎవరైనా వారి భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవచ్చని తెలిపారు.ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న భూభారతి చట్టంలోని నిబంధనల ప్రకారం రికార్డులను అప్డేట్ చేయడం జరుగుతుందన్నారు.కాగా,భూ సమస్యలు,లోటుపాట్ల సవరణ వంటి వాటి కోసం రైతులు మధ్యవర్తులను, దళారులను ఆశ్రయించవద్దని,ఎవరికీ ఎలాంటి డబ్బులు ఇవ్వకూడదని సూచించారు.అసైన్ మెంట్ భూములకు సంబంధించి కూడా త్వరలోనే ప్రభుత్వం సమగ్ర మార్గదర్శకాలను జారీ చేయనుందని తెలిపారు.ఈ సందర్భంగా భూభారతి చట్టంలోని కీలక అంశాలైన భూ రికార్డులలో తప్పుల సవరణ, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్,వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్,ఇతర మార్గాల ద్వారా వచ్చిన భూమికి మ్యుటేషన్, సాదా బైనామాల క్రమబద్ధీకరణ, పట్టాదారు పాసు పుస్తకాలు,అప్పీల్ వ్యవస్థ,రివిజన్ అధికారాలు,గ్రామ రెవెన్యూ రికార్డులు,రికార్డుల నకలు పొందడం ఎలా అనే అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.ధరణి పోర్టల్ లో లేని అనేక సమస్యలకు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని అన్నారు.అనంతరం ఆయా అంశాలపై రైతులు వెలిబుచ్చిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు.ఇంక ఈ నూతన చట్టంలో ఎలాంటి అంశాలు చేరిస్తే బాగుంటుందనే దానిపై సలహాలు సూచనలు చేయవచ్చని అన్నారు. ఈ సదస్సులలో ఆర్మూర్ ఆర్డీఓ రాజా గౌడ్,స్థానిక అధికారులు,రైతులు పాల్గొన్నారు.

# గ్రూప్–1 నియామకాలకు బ్రేక్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

రాష్ట్రంలో గ్రూప్ 1 పోస్టుల నియామకాలకు బ్రేక్ పడింది. తాము ఆదేశించే వరకు అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వొద్దని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. విచారణ పూర్తయ్యే వరకు గ్రూప్ 1కు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వొద్దని పేర్కొంది. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగించేందుకు అనుమతిచ్చింది. అభ్యర్థుల డాటా నమోదుకు సంబంధించిన కంప్యూటర్ లాగ్ హిస్టరీ సమర్పించాలని సర్వీస్ కమిషన్‌ను ఆదేశించింది. గ్రూప్ 1 పరీక్ష మూల్యాంకనంలో తప్పులు జరిగాయని, దీనిపై స్వతంత్ర న్యాయ విచారణ జరిపించాలంటూ ఎం పరమేశ్ సహా 20 మంది దాఖలు చేసిన పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలపై సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని న్యాయమూర్తి టీజీపీఎస్సీకి నోటీసులు జారీచేశారు. రీకౌంటింగ్ దరఖాస్తు చేస్తే మారులు తగ్గిన అభ్యర్థిని ప్రతివాదిగా చేర్చాలని పిటిషనర్లను కూడా ఆదేశించారు. పిటిషనర్లు ప్రస్తుతం ఎకడ పనిచేస్తున్నారో, వాళ్ల హోదా, ఇతర వివరాలను నివేదించాలన్నారు. ఒకవేళ తప్పుడు వివరాలతో పిటిషన్లు వేసుంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని పిటిషనర్లను హెచ్చరించారు. అదే సమయంలో టీజీపీఎస్సీలో అవకతకవలు జరిగాయని తేలితే కూడా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. తదుపరి విచారణను ఈ నెల 28వ తేదీకి వాయిదా వేశారు.పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది రచనారెడ్డి వాదనలు వినిపిస్తూ.. 563 గ్రూప్ 1 పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షలో రెండే రెండు పరీక్షా కేంద్రాల నుంచి ఏకంగా 71 మంది ఎంపికయ్యారని చెప్పారు. ఇది అనేక అనుమానాలను రేకెత్తిస్తున్నదని అన్నారు. ఇక 482 మారులు వచ్చిన ఒక అభ్యర్థి ఇంకా ఎకువ మారులు వస్తాయని రీకౌంటింగ్ చేయించుకుంటే అవి 422కు తగ్గిపోయాయని తెలిపారు. జనరల్ ర్యాంకింగ్ లిస్ట్‌లో పబ్లిష్ చేయడానికి కంప్యూటర్స్‌లో మార్పులు చేశారని, లాగ్ హిస్టరీ పరిశీలిస్తే ఈ బాగోతం బట్టబయలు అవుతుందని చెప్పారు. దీనిపై అడిగితే ఫోర్జరీ అని చెప్తున్నారని, ఇదే నిజమైతే ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని, ఇవన్నీ గ్రూప్ 1లో అక్రమాలు జరిగాయని చెప్పడానికి కీలక అంశాలని తెలిపారు.

**కచ్చితంగా చెప్పడం సాధ్యం కాదు..**

టీజీపీఎస్సీ తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది పీఎస్ రాజశేఖర్.. మెయిన్స్‌కు ఎంపికైన వారంతా ఒకే ప్రాంతానికి చెందిన వారని చెప్పడంలో ఎలాంటి వాస్తవం లేదని పేర్కొన్నారు. ''అక్టోబరు 27న మెయిన్స్ చివరి పరీక్ష జరిగిన రోజు సమాచారాన్ని బట్టి మొత్తం అభ్యర్థులు 21,075గా కమిషన్ ప్రకటించింది. అందులో స్వల్ప మార్పులు ఉంటాయని సైతం ముందే తెలిపారు. ఆ తర్వాత మొత్తం సంఖ్య 21,085గా తేలింది. చివరి పరీక్ష రోజు మొత్తం అభ్యర్థుల సంఖ్యను కచ్చితంగా చెప్పడం సాధ్యం కాదు. రెండు సెంటర్ల నుంచి ఎక్కువ మంది అభ్యర్థులు ఎంపికయ్యారన్న దానిలో వాస్తవం లేదు. పిటిషనర్లు ఆరోపిస్తున్న ఒక సెంటర్‌లో 792 మందికి 39 మంది (4.92శాతం) మరో సెంటర్‌లో 864 మందికి 32 మంది (3.7శాతం) మాత్రమే ఎంపికయ్యారు. హాజరైన అభ్యర్థులతో పోలిస్తే ఎంపిక శాతం చాలా తక్కువగా ఉంది. అవకతవకలు జరిగి ఉంటే అందరూ ఎంపిక కావాలి. లేదా ఆ సెంటర్లలో మిగిలిన అభ్యర్థులు అభ్యంతరం తెలిపేవారు. ఆయా సెంటర్లు మహిళా కాలేజీలు కావడం వల్ల అక్కడ మహిళా అభ్యర్థులు ఎక్కువ మంది ఉన్నారు. మెయిన్స్‌కు 45 సెంటర్లను తొలుత ప్రకటించినా ఒక సెంటర్ పెంచాల్సి వచ్చింది. అన్ని కేంద్రాలనూ ఎంపిక చేసిన తర్వాతే హాల్‌టికెట్లు జారీచేశాం'' అని ధర్మాసనానికి వివరించారు. మూల్యాంకనంలో పాల్గొన్న ఎంఏ మల్లిక్ ఆర్సీరెడ్డి కోచింగ్ సెంటర్‌లో పని చేస్తున్నారనే ఆరోపణ అవాస్తవమని.. ఆయన చేవెళ్ల డిగ్రీ కాలేజీలో ప్రభుత్వ ఉద్యోగి అని తెలిపారు.విశ్రాంత ఉద్యోగులను మూల్యాంకనం చేయడానికి తీసుకోవద్దని చట్టంలో లేదని పేర్కొన్నారు. ఈ పిటిషన్ వేసిన 20 మందిలో 19 మంది ప్రభుత్వ ఉద్యోగులని.. వారు ఎక్కడ పనిచేస్తున్నారు? అనే వివరాలు దాచిపెట్టి తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని ధర్మాసనానికి నివేదించారు.

# విద్యార్థులు క్రమశిక్షణతో నడవాలి

- నూతనకల్ లోని జిల్లా పరిషత్ హైస్కూల్ 67వ వార్షికోత్సవం
- ముఖ్య అతిథిగా తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి

నూతనకల్, విశాలభారతి:





విద్యార్థులు క్రమశిక్షణతో నడచి తల్లిదండ్రులను మంచి పేరు తీసుకురావాలని తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి అన్నారు. గురువారం నూతనకల్ మండల పరిధిలోని జిల్లా పరిషత్ హై స్కూల్(PMSHRI ZPHS)లో 67వ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు,చదువుకున్న పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకరావాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో PACS చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి , మండల విద్యాధికారి రామలు నాయక్ అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అభేదా ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
18.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
4
vishalabharathi Telugu Daily

## ప్రజా గ్రంథాలయానికి వితరణగా ఇంజనీరింగ్ పోటీ పరీక్షల పుస్తకాలు

విశాలభారతి,భీమదేవరపల్లి :




హనుమకొండ జిల్లా అనంతసాగర్ సుమతి రెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్, యూబీఏ విద్యార్థినులు ఇంజనీరింగ్ పోటీ పరీక్షలకి సంబందించిన 100 పుస్తకాలను ముల్కనూర్ ప్రజా గ్రంథాలయానికి వితరణగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజా గ్రంథాలయ ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి లక్ష్మయ్య, ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ అడ్వైజర్ మూల రాము పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు పాల్గొన్నారు





# ఘనంగా రాష్ట్ర కాంగ్రెస్ నేత సామ అభిషేక్ రెడ్డి జన్మదిన వేడుకలు

- జిల్లా యువజన కాంగ్రెస్ నేత నిద్ర సంపత్ నాయుడు
- ఆధ్వర్యంలో అన్నదానం, పండ్లు, బ్రెడ్ పంపిణీ

సూర్యాపేట, విశాలభారతి:

జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు నిద్ర సంపత్ నాయుడు ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సామ అభిషేక్ రెడ్డి జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రం లో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రం లోని కుడ కుడ రోడ్డు లో గల శ్రీ అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ అనాథ వృద్ధుల, వికలాంగుల ఆశ్రమంలో సుమారు వంద మంది అనాధలకు అన్నధానం చేయడంతో పాటు సూర్యాపేట ఏరియా హాస్పిటల్ లో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి అందరికి పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు నిద్ర సంపత్ నాయుడు మాట్లాడుతూ నేటి యువతకు ఆదర్శంగా ఉండడంతో పాటు భవిష్యత్తు తరాలకు ఆశా కిరణం, నిరంతరం ప్రజల శ్రేయస్సు కోరే యువ నాయకుడు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సామ అభిషేక్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎస్ కే. రషీద్, కోమటిరెడ్డి నర్సిరెడ్డి, పద్మా రెడ్డి, దేశగాని సతీష్, నాగిరెడ్డి, కొంపల్లి ప్రశాంత్ యాదవ్, కొరవి గంగయ్య, పోలోజు మహేష్, నర్సిరెడ్డి, సురేష్ నాయక్, నరేష్, రాజశేఖర్,నవీన్ పాల్గొన్నారు.

# మున్సిపల్ కమీషనర్‌కు పదోన్నతి

బాల్కొండ,విశాలభారతి:

భీమ్‌గల్ మున్సిపల్ కమీషనర్ గోపు గంగాధర్ కు పదోన్నతి లభించింది.ఈ నెల 16న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు జీవో విడుదల చేయడం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 31 మంది మున్సిపల్ కమీషనర్లకు గ్రేడ్ 3 నుండి గ్రేడ్ 2 కు పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.బాసర మల్టీ జోన్ వన్ లో పదోన్నతి పొందిన వారిలో 11 మంది ఉన్నారు.11 మందిలో భీమ్‌గల్ మున్సిపల్ కమీషనర్ గోపు గంగాధర్ ఒకరు.జీవో నంబర్ 214 ద్వారా ప్రభుత్వం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ద్వార ఉత్తర్వులు వెల్లడించడం జరిగింది.



పదోన్నతి పొందిన మున్సిపల్ కమీషనర్ గంగాధర్ కు మున్సిపల్ సిబ్బంది,స్థానిక అధికారులు,నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

# ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ నూతన కమిటి ఎన్నిక

సూర్యాపేట, విశాలభారతి:



ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ సూర్యాపేట లోకల్ బ్రాంచి నూతన కమిటీని గురువారం స్థానిక రాయినిగూడెం వికాస్ ఫార్మసీ కళాశాలలో ఎన్నుకున్నారు. అధ్యక్షురాలు గా డా. జి స్వరూపరాణి, ఉపాధ్యక్షులుగా డా. జి నటేష్, కార్యదర్శిగా డా. జి నీలమ్మ, కోశాధికారిగా డా. జి నరసింహారావు, ఈసీ మెంబర్లుగా డా.సమత, డా.సాయి పవన్, డా.ధీరజ్, డా.గీత లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు డా. ఆనంద్ గాంధ్లే, జిల్లా ఔషధ అధికారి డా.సురేందర్, తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ సభ్యులు పరమాత్మ సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. సంఘం జాతీయ ఉపాధ్యక్షులు డా. ఆడెపు రమేష్ ఎన్నికల అధికారిగా వ్యవహరించి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సాదినేని శ్రీనివాసరావు, వినయ్, ఫార్మసిస్టులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్లు లేని ఆసుపత్రులపై చర్యలు తప్పవు

- క్వాలిఫైడ్ డాక్టర్లు మాత్రమే వైద్యం చేయాలి.
- ఆరోగ్య పరిరక్షణలో ఐఎంఏ కృషి.

సూర్యాపేట,విశాలభారతి:



సూర్యాపేటలో డాక్టర్లు లేకుండా నడిపిస్తున్న వైద్యశాలల విషయంలో రాజీలేదని, నకిలీ డాక్టర్ల తో నడిపిస్తున్న ఆసుపత్రి పై ఐఎంఏ తప్పకుండా చర్యలు తీసుకుంటుందని సీనియర్ డాక్టర్ రామ్మూర్తి యాదవ్ అన్నారు. సూర్యాపేటలో డాక్టర్లు లేకుండా నడిపిస్తున్న వైద్యశాలల విషయమై గురువారం సాయంత్రం జిల్లా ఎస్పీకి ఐఎంఏ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సూర్యాపేటలో మేనేజ్మెంట్ నిర్వహణలో డాక్టర్లు లేకుండా దాదాపు 60 ఆసుపత్రులు నిర్వహిస్తున్నారని, ఈ విషయంలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి, జిల్లా ఎస్పీకి వినతి పత్రాలు ఇచ్చామని, శుక్రవారం జిల్లా కలెక్టర్ కూడా కలిసి డాక్టర్ లేకుండా నిర్వహిస్తున్న నకిలీ ఆసుపత్రుల విషయంలో చట్టపరంగా తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేస్తామని వివరించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో సూర్యాపేట ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విభాగం ఎలాంటి రాజీ లేకుండా ముందుకు పోతుందని చెప్పారు. క్వాలిఫైడ్ డాక్టర్ల ద్వారానే ప్రజలకు వైద్యం అందేలా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తన వంతు కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. క్వాలిఫికేషన్ లేకుండా చికిత్సలు అందజేస్తే ఐఎంఏ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ప్రజలు కూడా నకిలీ డాక్టర్లు పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇంకా ఆయనతోపాటు డాక్టర్లు యశ్వంత్ రెడ్డి, కిరణ్, ఎల్ రమేష్ నాయక్, తెలంగాణ మెడికల్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ రాజీవ్ పాల్గొన్నారు.





# ధాన్యానికి మంచి ధర అందించాలి..

- వేసవిని దృష్టిలో ఉంచుకొని మార్కెట్ లో రైతులకు చల్లని త్రాగునీటి సౌకర్యం కల్పించాలి.
- రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దు
- పేట వ్యవసాయ మార్కెట్ కలియ తిరిగిన మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ గుప్తా

సూర్యాపేట, విశాలభారతి:

సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కు రైతులు తీసుక వచ్చే ధాన్యంకు మంచి ధర అందించి వారి కళ్లలో ఆనందం నింపాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ గుప్తా సంబందిత మార్కెట్ అధికారులను ఆదేశించారు. గురువారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ ను ఆయన సందర్శిం చి రైతుల ధాన్యాన్ని పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్ కార్యాలయంలో రైతులకు పడిన ధరలను పరిశీలించి రైతులకు మంచి ధర వేయాలని అధికారులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పాటుపడుతుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలను తీసుకుంటుందన్నారు. ఇప్పటికే ప్రతి గ్రామంలో ఐకెపి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు కొనుగోలు చేసిన ధాన్యంకు మూడు రోజుల్లో రైతుల డబ్బులను వారి అకౌంట్లో జమ చేస్తుందన్నారు. అలాగే సన్న. ధాన్యానికి బోనస్ క్వింటాకు రూ. 500 చెల్లిస్తుందని వివరించారు. మార్కెట్, ఐకెపి కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చే రైతులు తేమ, తాలు లేకుండా శుభ్రంగా తీసుకువస్తే వెంటనే కొనుగోలు చేయడంతో పాటు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందవచ్చు అన్నారు. సుదూర ప్రాంతాల నుంచి మార్కెట్ కు వచ్చే రైతులకు వేసవి కాలం దృష్ట్యా చల్లటి తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. గురువారం మార్కెట్ కు 616 మంది రైతులు 19 వేల 198 క్వింటాల ధాన్యం తీసుకురాగా జై శ్రీరామ్ రకం ధాన్యం కు అత్యధికంగా క్వింటాకు రూ. 2,379 ధర లభించిందని అన్నారు. ఆయన వెంట మార్కెట్ సెక్రటరీ సంతోష్ కుమార్, అసిస్టెంట్ సెక్రటరీ శ్రీనివాస్, యుడి సి ఖాసిం, కాంగ్రెస్ నాయకులు మర్ల కరుణాకర్ రెడ్డి, ధారావత్ ధర్మానాయక్, సిరివెళ్లి సైదులు, వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి శాసనసభ సభ్యత్వానికి అనర్హుడు

- బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్

బాల్కొండ,విశాలభారతి

బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి శాసనసభ సభ్యత్వానికి అనర్హుడని, బుధవారం జరిగిన కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ఒక వీధి రౌడీలా ప్రవర్తించాడని బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. గురువారం మోర్తాడ్ మండల కేంద్రంలోని ప్రజా నిలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒక క్యాబినెట్ మంత్రి నియోజకవర్గానికి వస్తే గౌరవించలేని ఎమ్మెల్యే శాసనసభ సభ్యత్వానికి అనర్హుడని అన్నారు. ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు ఆయనను అడ్డుకోవాలంటే మాకు ఎంతటి పని బాల్కొండ నియోజకవర్గంలో ప్రజలను ఇబ్బందులకు, అయోమయానికి గురి చేయొద్దు అన్న ఉద్దేశంతో ఆనాడు విజ్ఞాపనలు,అభ్యర్థనలే చేశాం తప్పితే ఏనాడు భౌతికంగా ఎటువంటి చర్యలకు పాల్పడలేదని తెలిపారు.ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పది సంవత్సరాలు తన చుట్టూ రౌడీ రాజ్యాన్ని నిర్మించుకున్నారని,ఆ రౌడీలతో గతంలో ప్రజల మీద దాడులు చేయించేవారని,ఇప్పుడు ఏకంగా పోలీసుల మీదనే దాడులు చేయిస్తున్నారని తెలిపారు. పోలీసుల మీద భౌతిక దాడికి పాల్పడడం ద్వారా పోలీసులు లా అండ్ ఆర్డర్ ను కాపాడడం దృష్ట్యా లాటిఛార్జి చేశారని తెలిపారు.పోలీసుల దగ్గర దాడికి పాల్పడిన ప్రతి ఒక్కరి వీడియోలు ఉన్నాయని చట్టం నుంచి వారు తప్పించుకోలేరని హెచ్చరించారు. పథకం ప్రకారమే ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి దాడి చేయించారని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఎవరిపై కేసులు పెట్టించలేదని,కానీ ఇప్పుడు దాడికి పాల్పడిన ప్రతి ఒక్కరిపై హత్యాయత్నం కింద కేసులు నమోదు చేసి రిమాండ్ చేయాలని ఆయన పోలీసులను డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజాస్వామ్యానికి విలువనిస్తూ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డిని ప్రభుత్వపరంగా ప్రోటోకాల్ ఇచ్చి గౌరవిస్తే,ఆయన ప్రతి ప్రభుత్వ కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తలుచుకుంటే ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి కనీసం రోడ్ల మీద కూడా తిరగ లేడని,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.




# రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్రలు

- రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల.

ఆమనగల్లు,విశాలభారతి,:

రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయితేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, రాజ్యాంగానికి రక్షణ ఉంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల, టీపీసీసీ సభ్యుడు అయిల్లా శ్రీనివాస్ గౌడ్, ఇంచార్జ్ శ్రీనివాస్ లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని మాజీ జడ్పిటిసి శ్రీపతి శ్రీనివాస్ రెడ్డి శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించి, గ్రామంలో వాడ వాడ తిరుగుతూ ప్రభుత్వం చేపట్టుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామంలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరించి అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నాడని, రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు చేస్తున్నారని తెలిపారు. గాంధీ శాంతి సందేశం, అంబేద్కర్ సామాజిక న్యాయ పోరాటం, రాజ్యంగ విలువలను ప్రజలకు చేరవేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, తాళ్ళ రవీందర్, ఆదివాసి రాష్ట్ర నాయకుడు కృష్ణ నాయక్, మాజీ సర్పంచులు ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం, వెంకటరమణారెడ్డి, బలరాం, మాజీ ఎంపీపీ అనిత విజయ్, మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణ, మాజీ ఉప సర్పంచ్ కొప్పు శేఖర్ గౌడ్, అంజన్ రెడ్డి, ఎన్ఎస్ఈయూఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, ప్రసాద్, మాజీ యూత్ మండల అధ్యక్షుడు అండేకార్ రాజు, వెంకట్ రెడ్డి, దేవరశెట్టి మహేష్, విజయ్ రాథోడ్, షాబోద్దీన్, బాలు, గోవింద్, కొండయ్య, షఫీ, నర్సింహా, బుచ్చయ్య, చిన్న, కృష్ణయ్య, రాజు, అఫ్రోజ్, శ్రీను, డిగ్రీ కృష్ణ, పులికంటి మైసయ్య తదితరులు పాల్గొన్నారు.



# మందకృష్ణ మాదిగ కష్టాన్ని ఎన్నటికి కూడా మరువలేది

బాల్కొండ,విశాలభారతి

భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో భీమ్‌గల్ మండల పరిధిలోని అన్ని గ్రామాల మాదిగల ఆధ్వర్యంలో బాబాసాహెబ్ అంబేద్కర్,మందకృష్ణ మాదిగ, సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు.ఎస్సీ వర్గీకరణ జీవో అమల్లోకి వచ్చినందకు దానికి కారణమైనటువంటి డా.అంబేద్కర్,మాదిగల పక్షాన 30 ఏళ్ల పోరాటం చేసిన మందకృష్ణ మాదిగ,సీఎం రేవంత్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి వారికి పాలభిషేకం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పద్మశ్రీ మందకృష్ణ మాదిగ మాదిగ గుండెల్లో నిలిచిపోయరని, వారి కష్టాన్ని మాదిగ జాతి ఎన్నటికి కూడా మరువలేనిదని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాదిగ ఐక్యవేదిక కమిటీ సభ్యులు గడల ప్రసాద్,యోనా,రతన్ రాజ్, రాజేందర్,రాజేష్,నరేష్,రాజేష్, చెప్పాలా గణేష్, జె.జె నర్సయ్య, రాజేశ్వర్,అశోక్,లక్ష్మణ్,విక్రమ్,సంతోష్ అన్ని గ్రామాల పెద్ద మనుషులు,మాదిగ ప్రజలు, మహిళలు అందరు పాల్గొన్నారు.



విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
18.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## పౌష్టికాహారం తీసుకోవాలి

**సూపర్వైజర్ జ్యోతి**



**శాలిగౌరారం, విశాలభారతి:**

శాలిగౌరారం మండలం ఊటుకూరు గ్రామంలోని పోషణ పక్వాడ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ ఎం జ్యోతి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు బాలింతలు పిల్లలకు పౌష్టికాహారం అందించాలని అంగన్వాడీ టీచర్లకు సూచించారు. గర్భిణీ స్త్రీలు బాలింతలు పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సిహెచ్ .అంజమ్మ వై సునీత తదితరులు ఉన్నారు.



## అథ్లెటిక్స్ క్రీడాకారిణికి అభినందించిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**పటాన్ చెరు,విశాలభారతి**

జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించిన అథ్లెటిక్స్ క్రీడాకారిణి ధరణిని ఎమ్మెల్సీ సీ.అంజి రెడ్డి అభినందించారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలోని వెలిమెల గ్రామానికి చెందిన ధరణి జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా రామచంద్రాపురం పట్టణంలోని ఎమ్మెల్సీ అంజిరెడ్డి నివాసంలో గురువారం ధరణి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసింది. ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఆమెను శాలువను కప్పి సన్మానించి, అభినందించారు. క్రీడల్లో రాణించి, మరిన్ని పథకాలు సాధించి తెలంగాణకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, ధరణి తండ్రి శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పటాన్ చెరు, దౌల్తాబాద్ రహదారి మరమ్మతులు చేపట్టాలి

- రహదారిపై గుంతలు..ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తహసిల్దార్ కు వినతి పత్రం అందజేత



**పటాన్ చెరు,విశాలభారతి**

పటాన్ చెరు నుండి ఇంద్రేశం మీదుగా దౌల్తాబాద్ వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి, వెంటనే రోడ్డును విస్తరింపచేయాలని సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి బి.నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రహదారి పనులు వెంటనే చేపట్టాలని కోరుతూ గురువారం పటాన్ చెరు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో తహసిల్దార్ రంగారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రాంతం మీదుగా రోజువారీగా వేలాదిమంది ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారని, భారీ నుంచి అతి భారీ వాహనాలు అధికలోడుతో వెళుతున్నాయని అన్నారు. దీని వలన ఆర్ అండ్ బి రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారిపోయిందన్నారు. ఇంద్రేశం ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని, రోడ్డు సక్రమంగా లేకపోవడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వాహనాలు తిరగడం మూలంగా దుమ్ము ధూళితో ప్రయాణించేవారు ఇబ్బందులు ఎదుర్కొంటూ అనారోగ్యానికి గురవుతూ, రోగాల బారిన పడుతున్న అధికారంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రోడ్డు పనులను వెంటనే ప్రారంభించి విస్తరణ చేపట్టాలని, లేనిపక్షంలో ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం శ్రీనివాస్, రామకృష్ణ, నారాయణ ఇతరులు పాల్గొన్నారు.



## యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహా ధర్నా

**నాచారం, విశాలభారతి:**

రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ పిలుపు మేరకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ మీద బీజేపీ ప్రభుత్వం ఈడి ముసుగును అడ్డుకొని నేషనల్ హెరాల్డ్ కేసులో వారిపై ఛార్జ్ షీట్ ఫైల్ చేసినందుకు దానిని వెతిరేకస్తూ ఎలిఫెంట్ సర్కిల్ వోదా మల్లాపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మెరుపుల జయంత్ గౌడ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్, ఉప్పల్ అసెంబ్లీ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్, సీనియర్ నాయకులు బాలరాజ్ గౌడ్,ఎస్వి కిట్టు, జానీ భాయ్, పార్వతలు, శ్రీనివాస్ రెడ్డి, వర్మ తదితరులు పాల్గొన్నారు.



## అణచివేత ధోరణిని సహించం

- సోనియా,రాహుల్ పై వేసిన చార్జ్ షీట్ ను వెంటనే ఉపసంహరించుకోవాలి.
- రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వరరావు.

**సూర్యాపేట,విశాలభారతి:**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విపక్షాల గొంతు అణిచివేయాలని చూస్తోందని, దానిలో భాగంగానే సోనియా, రాహుల్ గాంధీల పై అక్రమంగా కేసులు నమోదు చేసిందని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వరరావు అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ ప్రధాన కార్యాలయం ఎదురుగా కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ఖండిస్తూ, కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించిన మహాధర్నాలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. నేషనల్ హెరాల్డ్ పత్రిక ను జవహర్ లాల్ నెహ్రూ స్థాపించారని, అది కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో నిర్వహించారనీ, ఆ పత్రికను నష్టాలు రావడం వలన మూసివేయాలసి వచ్చిందని, ఆ ఆస్తులకు సంరక్షకులుగా ఉన్నటువంటి నేటి తరం కాంగ్రెస్ నేతలు, వాటిని ఇతరత్రా కార్యక్రమాలకు వాడుకుంటుంటే తప్పేమిటో చెప్పాలని బిజెపి నాయకులకు ఆయన సవాల్ విసిరారు. ఇది కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారం అని, ఇతర పార్టీల అంతర్గత వ్యవహారాల్లో తల దూర్చడం మంచిది కాదని అన్నారు. బిజెపి ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను రాహూల్ గాంధీ ఎండ కడుతూంటే తట్టుకోలేక తీవ్ర అసహనంతో ఏం చేయాలో పాలుపోక దిక్కు తోచని స్థితిలో సోనియా, రాహుల్ గాంధీల గొంతు నొక్కి తమ తప్పులను దాచే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సోనియా, రాహుల్ గాంధీల వెంట ఉన్నారనీ, ఈ బిజెపి ప్రేరిత ఇడి, ఐటి శాఖలు అక్రమ చార్జి షీట్ లతో ఏమి చేయలేరని, చట్టపరంగా ఎదుర్కొంటామని, కేంద్ర ప్రభుత్వం ఈ బెదిరింపు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజద్ అలీ, కాంగ్రెస్ నాయకులు కక్కిరేణి శ్రీనివాస్, అభినయ్, బైరు శైలేందర్, కుమ్మరికుంట్ల వేణు గోపాల్, అలేటి మాణిక్యం, ధారావత్ వీరన్న నాయక్, చింతమళ్ళ రమేష్, పోలగాని బాలు గౌడ్, శబరీనాథ్, నాగుల వాసు, రుద్రంగి రవి, నూకల సుదర్శన్ రెడ్డి, బత్తిని వెంకటేశ్వర్లు, , గద్దల శిరీష, బొజ్జ సంజయ్, చెరుకు సాయి తదితరులు పాల్గొన్నారు.



## ముందస్తు అడ్మిషన్లు తీసుకున్నటువంటి శ్రీ చైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

- పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు పూల్లూరి సింహాద్రి

**సూర్యాపేట,విశాలభారతి:**

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఉన్నటువంటి కార్పొరేట్ శ్రీ చైతన్య ప్రైవేట్ స్కూల్ పర్మిషన్ ను రద్దు చేయాలని, ముందస్తు అడ్మిషన్ చేస్తున్న స్కూల్ ల ను సీజ్ చేయాలని పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో గురువారం సూర్యాపేట చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు పూల్లూరి సింహాద్రి మాట్లాడుతూ.. 202526 విద్యా సంవత్సరానికి ఎటువంటి అనుమతులు లేకుండా అకస్మాత్తుగా జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ శ్రీ చైతన్య ప్రైవేట్ విద్యాసంస్థల పేరుతో బోర్డ్ లు వెలిశాయని, పట్టణంలో, గ్రామాలలో తిరుగుతూ అడ్మిషన్లు చేస్తున్నారని అన్నారు. అనుమతులు లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తూ ఎటువంటి అకామిడేషన్ చూపించకుండా బ్రోచర్ లలో ఫీజులను మెన్షన్ చేయకుండా, తల్లిదండ్రుల దగ్గర వాళ్ళ అమాయకత్వం ఆసరా చేసుకొని లక్ష నుంచి లక్షన్నర వరకు ఫీజు ఉందని చెప్పి, ముందుగా వేల రూపాయలు కట్టి స్లాట్ బుక్ చేసుకోవాలని ప్రచారానికి దిగారని తెలిపారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి అనుమతి లేకుండా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో అధిక ఫీజులు వసూలు చేసే విద్యా సమస్యలపై ప్రత్యేక ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు నాయకులు, మహేష్,నవీన్, వినయ్, శ్రీధర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి జైలు శిక్ష

- రెండు వేల రూపాయల జరిమానా.




**సూర్యాపేట,విశాలభారతి:**

మద్యం సేవించి వాహనం నడిపిన ఒకరికి ఒకరోజు జైలు శిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధించిన సంఘటన గురువారం సూర్యాపేట పట్టణంలో చోటు చేసుకుంది. సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ ఆర్. సాయిరాం తెలిపిన వివరాల ప్రకారం బుధవారం సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతాలలో సూర్యాపేట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేసి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిని గురువారం సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బి.వి.రమణ ఎదుట ప్రవేశ పెట్టగా సదరు వ్యక్తికి ఒక రోజు జైలు శిక్ష, రెండువేల రూపాయల జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేసిన ట్లు తెలిపారు.ఈ సందర్భంగా సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ ఆర్. సాయి రామ్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమైతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని . ఒకరు మద్యం సేవించి వాహనం నడపడం వల్ల రెండు కుటుంబాల ప్రమాదం బారిన పడతాయని, ఇరు కుటుంబాలను సమస్యలోకి వెళతాయని తెలిపారు.



## ఎరువు,విత్తనాల డీలర్లు అధిక నియమ నిబంధనలు పాటించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహా రావు

**ఆమనగల్లు, విశాలభారతి :**

విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహా రావు అన్నారు. డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని ఫర్టిలైజర్స్ షాపులను తనిఖీ చేశారు. విత్తన, ఎరువుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. ఎరువుల, విత్తనాల విక్రయానికి సంబంధించి అధీకృత డీలర్లు రైతులకు విధిగా రశీదు ఇవ్వాలని సూచించారు. ఈపాస్ ద్వారా ఎరువులు విక్రయించి అందుకనుగుణంగా నిల్వలు ఉండేలా చూసుకోవాలన్నారు. రైతులు కూడ కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలకు రశీదులు తప్పక తీసుకోవాలని తెలిపారు. నకిలీ విత్తనాలు ఎవరైనా విక్రయించి రైతులను మోసగిస్తే పీడీ యాక్ట్ కేసులు తప్పవని నర్సింహా రావు హెచ్చరించారు. తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు





## మామిడి పండ్ల క్రయ విక్రయాలను పరిశీలన

- మార్కెట్ కి వచ్చే మామిడి రైతులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం
- రైతుల ప్రయోజనాలే ముఖ్యం
- గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి

**పెద్ద అంబర్పేట్, విశాలభారతి :**

మామిడి పండ్ల సీజన్ నేపథ్యంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ పరిధిలోని బాటసింగారం పండ్ల మార్కెట్ లో గురువారం ఉదయం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో పాలకవర్గం, అధికారులు మామిడియార్డు మొత్తం తిరిగి సమస్యలను క్రయవిక్రయాలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ కి వచ్చిన రైతుల సమస్యలను తెలుసుకొని వారి సలహాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం మామిడి దిగుబడి అధికంగా ఉన్నదని,మార్కెట్ కి వచ్చే రైతులకు అన్ని రకాల సదుపాయాలు కలిపిస్తున్నామని చెప్పారు. రైతుల ప్రయోజనాలే మాకు ముఖ్యమని అన్నారు, రైతులకు మంచి గిట్టుబాటు అందించేలా అధికారులు చొరవ చూపాలని సూచించారు,రోజుకు 800 వాహనాలు మార్కెట్ కి వస్తున్న తరుణంలో ట్రాఫిక్ కి ఇబ్బంది కలగాకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ బాస్కర చారి,పాలకవర్గం సభ్యులు బండి మధుసూదన్ రావు,దోమలపల్లి అంజయ్య,నవరాజ్,మెగావత్ గణేష్ నాయక్,రఘుపతి రెడ్డి,మేకం లక్ష్మి,గోవర్ధన్ రెడ్డి,మచ్చేందర్ రెడ్డి,నరసింహ,ఎండీ ఇబ్రహీం తో పాటు మార్కెట్ కార్యదర్శి యెల్.శ్రీనివాస్, హర్ష,విజయ్, మురళి,శ్రీను,శ్రీశైలం తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# డాక్టరేట్ అందుకున్న చెరుకు ప్రభాదేవి"

**విశాలభారతి, ఓయూ :**

తాటిపాముల గ్రామం తిరుమలగిరి మండలానికి చెందిన చెరుకు ప్రభాదేవి ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఐటి విభాగంలో ప్రొఫెసర్ వి బి. నరసింహ పర్యవేక్షణలో "ఐడెంటిటీ అండ్ యాక్సెస్ మేనేజ్మెంట్ ఇన్ పబ్లిక్ క్లౌడ్ ఫ్రేమ్ వర్క్స్ " అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు గాను ఉస్మానియా యూనివర్సిటీ గెజిట్ ద్వారా చెరుకు ప్రభాదేవికి డాక్టరేట్ ప్రధానం చేశారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ డైరెక్టర్ చెరుకు సోమయ్య మరియు కలమ్మ దంపతులకు ప్రథమ పుత్రిక చెరుకు ప్రభాదేవి చిన్ననాటి నుండి చదువులో చురుకుగా ప్రతిభ కనబరిచి డాక్టరేట్ సాధించాలని ఉన్నత ఆశయంతో పీహెచ్డీ లో ప్రవేశం పొంది తన లక్ష్యాన్ని పూర్తి చేశారు. ఓయూ నుండి డాక్టరేట్ సాధించడం పట్ల అధ్యాపకులు భర్త దాసరి నారాయణ, తమ్ముడు చెరుకు యాకస్వామి మిత్రులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు ప్రభాదేవిని ఓయూ ప్రొఫెసర్లు, కోస్కాలర్స్ మిత్రులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభాదేవి మాట్లాడుతూ. పిహెచ్డి సాధించేందుకు సహకరించిన గైడ్ ప్రొ. వి.బి. నరసింహ సార్ హెచ్ఓడి పీవీ సుధా,ప్రొ. శ్యామల , ప్రొ. వెంకట దాస్ చిన్ననాటి నుండి విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు రుణపడి ఉంటానని అదేవిధంగా కుటుంబ సభ్యులకు మిత్రులకు గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
18.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



vishalabharathi Telugu Daily

## అంగన్వాడీ సెంటర్లలో అన్నప్రాసన

**కొడకండ్ల, విశాలభారతి:**

జనగాం జిల్లా కొడకండ్ల మండలం పరిధిలోని నర్సింగాపురం గ్రామంలో రెండు అంగన్వాడీ సెంటర్లలోని అంగన్వాడీ టీచర్లు డి.పద్మ టి.నిర్మల గురువారం పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమాన్ని ఐసిడిఎస్ సూపర్ వైజర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గ్రామ కార్యదర్శి ఉపాధ్యాయులు మహిళా సంఘాలు వివోలు ఆశ వర్కర్లు మొదలగు వారు పాల్గొన్నారు.










# గావ్ చలో, బస్తీ చలో

**- జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పల నర్సింహ్మా రెడ్డి.**

**ఎల్బీనగర్ ,విశాలభారతి :**

భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్పాయి శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు మునగాల హరీష్ రెడ్డి నేతృత్వంలో గావ్ చలో, బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథులుగా జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి, కొత్త రవీందర్ గౌడ్, కళ్లెం రవీందర్ రెడ్డి, తడకమల్ల విజయ్ కుమార్ విచ్చేసి బిజెపి కార్యకర్తలతో కలిసి పలు సేవా కార్యక్రమాలు చేశారు.గావ్ చలో, బస్తీ చలో కార్యక్రమ నేపద్యంలో చేపట్టిన పలు ప్రాంతాలలో ప్రభుత్వ ఆసుపత్రిలో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు.మన్సూరాబాద్ దళితవాడలో, దళిత మహిళ కుటుంబాన్ని సన్మానించి వారి ఇంట్లో భోజనాలు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో డివిజన్ బిజెపి నాయకులు మహిళా నాయకులు వివిధ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బీజేపీ కక్షపూరిత రాజకీయాలు మానుకోవాలి

- **సోనియా, రాహుల్ పై కేసులు ఎత్తేయ్యాలి**
- **మేడ్చల్ జిల్లా వైస్ ఛైర్మన్ వడ్లోజు ఉమేష్ చారి**

**మేడిపల్లి, విశాలభారతి :**

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజకీయ కక్షతోనే కాంగ్రెస్ అగ్రనేతలపై తప్పుడు కేసుల్లో ఇరికిస్తున్నారని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ మేడ్చల్ జిల్లా వైస్ ఛైర్మన్ వడ్లోజు ఉమేష్ చారి అన్నారు. నేషనల్ హెరాల్డ్ కుసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్గాంధీల పేర్లను చార్జిషీట్లో నమోదు చేయడాన్ని నిరసిస్తు హైదరాబాద్ ఈడీ కార్యాలయం ఎదుట నిరసన దర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, టీపీసీసీ ముఖ్యనేతలు.. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నాయకులతో కలిసి ధర్నాలో పాల్గొన్న ఉమేష్ చారి మాట్లాడుతు.. ప్రస్తుతం దేశ వ్యాప్తంగ కాంగ్రెస్ పార్టీకి, రాహుల్ గాందీకి ఆదరణ పెరుగుతుందని, బీజేపీ ప్రజాధరణ తగ్గుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే అధికారాన్ని అడ్డుపెట్టుకుని, న్యాయ వ్యవస్థలను వాడుకుని తమ నేతలను అణిచివేయాలని కుట్రలు చేస్తున్నరని విమర్శించారు. అధికారులు రాజకీయాలకు పోకుంట కాంగ్రెస్ అగ్రనేతల పేర్లను తొలిగించాలని, లేనిపక్షంలో దేశ వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ లీగల్సెల్ ఛైర్మన్ అశోక్ గౌడ్, వైస్ ఛైర్మన్ తిరుపతివర్మ , వక్ఫ్ బోర్డ్ సబ్యుడు మోమిన్రోషన్, మేడ్చల్ లీగల్ సెల్ ఛైర్మన్ అభిలాష్ ప్రభాకరణ్ పాల్గొన్నారు.



# పేదలకు కావలసింది మంచి విద్య వైద్యం

- **కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

అటల్ బీహారీ వాజ్పేయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు హయత్ నగర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు గంగాని శ్రీను ఆధ్వర్యంలో హయత్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం గానీ, గత బిఆర్ఎస్ ప్రభుత్వం గానీ ప్రభుత్వ పాఠశాలల పట్ల గాని ప్రభుత్వ ఆసుపత్రిల పట్ల పూర్తి నిర్లక్ష్యత వహిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన, విపరీతమైన దోమలతో పిల్లలు అనారోగ్య బారిన పడుతున్నారని, హయత్ నగర్ లో ఉన్నటువంటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియాలో దాదాపు 1500 మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారని వారికి కనీస మౌలిక వస్తువులతో పాటు సరిపడా ఉపాధ్యాయులుగాని సరిపడ తరగతి గదులు, టాయిలెట్స్ లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,పేదలకు కావాల్సింది మంచి విద్య, వైద్యం కానీ రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్యం పట్ల పూర్తి నిర్లక్ష్యత వహిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి నుంచైనా పేదలకు మంచి విద్య వైద్యం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్ రెడ్డి , జక్కిడి ప్రభాకర్ రెడ్డి ,మల్కాజిగిరి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్ , డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీను, జిల్లా నాయకులు ఉగాది ఎల్లప్ప , పారంద మహేష్ , జంజ్య నాయక్ , అధ్యక్షురాలు పార్వతి , డివిజన్ ప్రధాన కార్యదర్శిలు సంఘీ అశోక్ గారు, గోవింద చారితో పాటు స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- **విద్యుత్, నీటి సమస్య రాకుండా చూడండి**
- **రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నగేష్**
- **జిహెచ్ఎంసి అధికారులతో సమీక్ష సమావేశం**

**పటాన్ చెరు,విశాలభారతి**

డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని రామచంద్రాపురం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్ అధికారులను కోరారు.రామచంద్రపురం డివిజన్ శ్రీనివాస్ నగర్ కాలనీలో ఉన్న కార్పొరేటర్ కార్యాలయంలో కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబెర్ పుష్పనగేష్ జిహెచ్ఎంసి అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సురేష్, ఎఎంఓహెచ్ విజయ్ మోహన్, ఎస్ఎస్ పవన్, ఎఎంసి సురంజన్, ఇంజనీరింగ్ డిఈ నరేంద్ర, ఎఈ దివ్య తేజ, ఎలక్ట్రికల్ డిఈ లక్ష్మీప్రియ, ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రభాకర్, కమ్యూనిటీ ఆఫీసర్ జ్యోతి, ఎంటమాలజీ ఏఈ తిరుపతయ్య, ఎలక్ట్రిసిటీ ఎఈ తిరుపతమ్మ, యుబిడి మేనేజర్ మానస, హెచ్ఎంయూఎస్ డిజిఎం శివకృష్ణ, మేనేజర్ లోకేష్, నేషనల్ హైవే ఎఈఈ శ్రీకాంత్, డాక్టర్ కల్పన, సానిటేషన్ ఎస్ఆర్పి మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు. డివిజన్ పరిధిలో జరుతున్న,జరగనున్న అభివృద్ధి పనుల పై కార్పొరేటర్ అధికారులతో చర్చించారు. బాలవిహార్ పార్క్, సండే మార్కెట్ సీసీ రోడ్, 12,13వ బ్లాక్ లలో సీసీ రోడ్, నూతన ఆక్టోగొనల్ పోల్స్, సండే మార్కెట్ రోడ్ విస్తారణలో పోల్, ట్రాన్స్ఫార్మర్ షిఫ్టింగ్, నూతన లైటింగ్, ఇతర పనులు ప్రారంభోత్సవం సందర్భంగా త్వరలోనే జిహెచ్ఎంసి మేయర్, స్థానిక ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని కలవనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పనులను త్వరగా పూర్తి చేయాలని డిసి, అధికారులను ఆదేశించారు. త్వరలోనే సుమారు 1.60 కోట్ల సీవరేజ్ లైన్లు మంజూరు కానున్నాయని, సీసీ రోడ్ల ప్రతిపాదనలు పూర్తి చేస్తే నిధులు మంజూరు చేయిస్తామని చెప్పారు. వేసవి కాలం నందున కరెంటు సమస్య తలెత్తకుండా చూడాలని ఎలక్ట్రిసిటీ అధికారులను, నీటి సమస్య రాకుండా చూడాలని జలమండలి అధికారులను కార్పొరేటర్ కోరారు. వారంలో రెండు రోజులు ఉదయం 5 గంటలకు బస్తీ, కాలనీలలో శానిటేషన్ సమస్య పరిష్కారానికి అధికారులు పర్యటించాలని సూచించారు. ప్రజల సమస్యలు పరిష్కారానికి, డివిజన్ అభివృద్ధికి అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని కార్పొరేటర్ పుష్ప నగేష్ కోరారు.






# వీసీ వై.ఎల్ శ్రీనివాస్ ను సన్మానించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి

**ఉప్పల్ , విశాలభారతి:**

సమ్మక్కసారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి వైస్ఛాన్సలర్గా నియమితులైన ప్రొఫెసర్ వై.ఎల్. శ్రీనివాస్ హాబ్సిగూడ లో సన్మానించారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యుడిగా,ఆరోరా ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి అకాడమీలో వైస్ఛాన్సలర్గా ఆయన ప్రస్తుతం కొనసాగుతున్నారు.శాతవాహన, పాలమూరు విశ్వవిద్యాలయాల్లో బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్గాను బాధ్యతలు నిర్వర్తించారు అని నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్న్యాక్ కు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగాను పనిచేశారు. వీసీగా నియమితులైన ప్రొఫెసర్ వై.ఎల్. శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. ఆయన అనుభవం గిరిజన విశ్వవిద్యాలయం పురోభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సురేష్ కుమార్ , బీజేపీ నాయకులు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న బీజేపీ

- **ఈడీ ని అడ్డుపెట్టుకుని అక్రమ కేసులు బనాయిస్తున్న మోదీ**
- **నేషనల్ హేరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ పై ఈడి చార్జిషీట్ అన్యాయం**
- **కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్**
- **హైదరాబాద్ ఈడి ఆఫీస్ ముందు టీపీసీసీ ఆధ్వర్యంలో ధర్నా**







**పటాన్ చెరు,విశాలభారతి**

సిబిఐ, ఈడి లాంటి దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని కేంద్రంలోని బీజేపీ సర్కార్ ప్రతిపక్షాల నాయకుల పై అక్రమ కేసులు బనాయిస్తూ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తుంది అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ ఆరోపించారు. గురువారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని ఈడి కార్యాలయం ఎదుట చేపట్టిన భారీ నిరసన కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎంఎల్సీల తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ ఈడి ని అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పై తప్పుడు కేసులు బనాయిస్తూ రాక్షసానందం పొందుతున్నారని విమర్శించారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు తెగనమ్ముతూ ప్రశ్నించిన ప్రతిపక్ష నాయకుల పై కేసులు పెడుతున్నారని ఆరోపణలు గుప్పించారు. అడ్డగోలుగా బ్యాంకుల్ని ముంచిన కార్పొరేట్ వ్యాపారస్తులకు మద్దతునిస్తూ వారిని దేశం దాటిస్తూ నరేంద్ర మోడీ ప్రభుత్వం పేద ప్రజలను నిండా ముంచుతుందన్నారు. నేషనల్ హెరాల్డ్ విషయంలో కక్షపూరితంగా వ్యవహరిస్తూ సోనియా గాంధీ రాహుల్ గాంధీ పేర్లను చార్జిషీట్లో చేర్చడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ ప్రతిపక్ష నాయకుల పై తప్పుడు కేసులు పెడుతున్న బిజెపి ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలోనే ఎండగడతామన్నారు. కాంగ్రెస్ అగ్ర నాయకుల పై పెట్టిన తప్పుడు కేసులను ఉపసంహరించకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపట్టి బిజెపి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
18.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## మర్రి యాదవ రెడ్డిని పరామర్శించిన శాసనమండలి డిప్యూటీ చైర్మన్



**తిరుమలగిరి, విశాలభారతి:**

వరంగల్ కుడా మాజీ చైర్మన్, గ్రాడ్యుయేట్ అసోసియేషన్ అధ్యక్షుడు మర్రి యాదవ రెడ్డివారి మాతృమూర్తి మర్రి వెంకటమ్మ మరణించగా వారి కుటుంబాన్ని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ పరామర్శించారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామంలో వెంకటమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం యాదవ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

# భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కారం

- **తెజస్ నంద్ లాల్ పవార్**

**గరిడేపల్లి, విశాలభారతి:**



భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం హుజూర్ నగర్ డివిజన్ పరిధి లోని గరిడేపల్లి మండల కేంద్రంలోని రామ కోటయ్య పంక్షన్ హాల్ లో భూ భారతి చట్టం 2025 పై అవగాహన సదస్సు కార్యక్రమం లో జిల్లా ఎస్పి నరసింహ తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి రోజున భూ భారతి చట్టం అమలులోనికి తీసుకొని రావటం జరిగిందని తదుపరి రాష్ట్ర స్థాయి లో, జిల్లా స్థాయి లో రెవిన్యూ సిబ్బందికి అవగాహన కల్పించటం జరిగిందని ఇప్పుడు మండల స్థాయి లో ప్రజలకి చట్టం పై అవగాహన తెచ్చేందుకు 23 మండలాలలో ప్రజలకి సమస్యలు ఎలా పరిష్కరించాలో అవగాహన సదస్సు లు నిర్వహిస్తామని పేర్కొన్నారు.ధరణిలో చాలా సమస్యలు పరిష్కరించలేనివి ఉన్నాయని ప్రతి సమస్య కలెక్టర్ ద్వారా గానీ కోర్టు ద్వారా గానీ పరిష్కరించే విధంగా ఉండేదని ప్రతి ఒక్కరు గ్రామం నుండి సూర్యాపేట వచ్చి సమస్య పై దరఖాస్తు ఇవ్వాలంటే ప్రజలకి చాలా ఇబ్బందిగా ఉండేదని కానీ భూ భారతి చట్టం ద్వారా అధికారం వికేంద్రికరణ జరుగుతుందని సమస్యని బట్టి తహసీల్దార్, ఆర్ డి ఓ, కలెక్టర్ స్థాయి లో పరిష్కరించవచ్చు అని త్వరలో గ్రామ స్థాయి లో భూ సమస్యలు పరిష్కరించేందుకు గ్రామ పరిపాలన అధికారి (జి పి ఓ)నియమించబోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దారులు కవిత, నాగార్జున రెడ్డి, సైదులు, కమలాకర్, మంగ, జ్యోతి, సురేందర్ రెడ్డి, పి ఎసిఎస్ చైర్మన్ లు సత్యనారాయణ, సుధాకర్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది వివిధ గ్రామాల నుండి వచ్చిన రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## సింజెంటా కంపెనీ విస్టోరియా ప్రో క్షేత్ర ప్రదర్శన

**కోదాడ, విశాలభారతి:**

సింజెంట కంపెనీ వారి ఆద్వర్యంలో చిలుకూరు గ్రామంలో వరిలో సుడిదోమ నివారణకు వెస్టోరియా ప్రో అనే నూతన ఆవిష్కరణ పంట క్షేత్ర ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమములో రైతులకి వరిలో వచ్చే ప్రధాన సమస్యలు సుడిదోమ, ఆకుచుట్ట పురుగు, మొగి పురుగులు, అన్ని రకాల తెగుళ్లు వాటికి సిన్జెంట కంపెనీ వారి పరిష్కార మార్గాలు, అదిక దిగుబడులు ఏలా సాదించాలో వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూర్యాపేట టెర్రటరీ మేనేజర్ మాలే సంతోష్ రెడ్డి, హైదరాబాద్ డివిజన్ బిజినెస్ మేనేజర్లు నవీన్ రెడ్డి, కళ్యాణ్ తెలంగాణ డివిజనల్ టెక్నికల్ డెవలప్మెంట్ మేనేజర్ డాక్టర్ అబ్దుల్ రషీద్, టీఎండీఈ రామకృష్ణ, ఎండిఓస్ జి రామకోటి, కె జగదీష్, ఏ మహేష్, ఏస్ వెంకటేష్, కె రమేష్, శంకర్, వెంకటేష్, 250 మంది రైతులు మరియూ 30 మంది పురుగు మందుల దుకాణం యజమానులు పాల్గొనారు.

## పశువులకు గాలికుంటువ్యాధి నివారణకు చర్యలు

**తొర్రూరు, విశాలభారతి:**



పాడి రైతులు పశువులకు అందించే గాలికుంటువ్యాధి నివారణ చర్యలలో భాగంగా టీకాలు వేయించే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్య అధికారి రాజశేఖర్ అన్నారు. పెద్ద వంగర మండలంలోని వద్దే కొత్తపల్లి గ్రామంలో పశుసంవర్ధశాఖ పశు వైద్యాధికారి రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు ఒక్కటే మార్గమన్నారు. ఈ వ్యాధి నివారణకు సంబంధించి పశువులకు టీకాలు వేయడం ఎంతో ఉపయోగమన్నారు. అలాగే వ్యాధిసోకిన పాడి పశువుల్లో తగ్గేపాల ఉత్పత్తిని శాశ్వతంగా నివారించవచ్చన్నారు. కావున రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ రాము, సంధ్య, పాషా, ఉప్పలయ్య పాల్గొన్నారు.



## ప్రాథమిక పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

**దేవరుప్పల, విశాలభారతి:**

మండలం సింగరాజు పల్లి గ్రామంలో 5వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థిని విద్యార్థులకు వీడుకోలు, మరియు(గ్రాడ్యుయేషన్ డే)ను నిర్వహించటం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల దాత రిటైర్డ్ గెజిటెడ్ (ప్రధాన ఉపాధ్యాయులు) వనమాల రమేశ్ విచ్చేసి గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్ అంది చేయటం జరిగింది.ఈ సందర్భంగా రమేష్ గారు మాట్లాడుతూ, విద్యార్థినీ విద్యార్థులు మశిక్షణగా ఉంటూ, ఉన్నత ప్రమాణాలు గల విద్యనభ్యసిస్తు పెద్దలను గౌరవిస్తూ, ఆదర్శ పౌరులుగా ఎదుగి సమాజానికి, తల్లిదండ్రులకు, మంచి పేరు తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమం హెడ్మాస్టర్ అంబటి అంజయ్య అధ్యక్షతన నిర్వహించగా ఉపాధ్యాయులు, మాధవి, చైతన్య, సునీత, ఆయా సోమలక్ష్మి తల్లిదండ్రులు జ్యోతి, విజయ, శ్రావణి, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులు చదువుల్లో రాణించాలి

- **ఏడూళ్ళ బయ్యారం జెడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలను సందర్శించిన జిల్లా విద్యాశాఖ అధికారి**

**పినపాక, విశాలభారతి:**

మండలంలోని ఏడూళ్ళ బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత ప్రాథమిక పాఠశాలను గురువారం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర చారి, ఏఎంఓ సందర్శించారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం రుచి, నాణ్యత, ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించే విధానం పాఠశాలలో నిర్వహిస్తున్న వివిధ రకాల రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. వారు పాఠశా ల లోని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రాథమిక స్థాయిలో విద్యా వ్యవస్థ బలోపేతం కావాలంటే నాణ్యమైన బోధన జరగాలన్నారు. సులభమైన రీతిలో అర్థవంతం గా బోధన జరిగితే విద్యార్థులకు ఉపయుక్తం గా ఉంటుందన్నారు. బోధనాభ్యసనలో విద్యార్థులు చైతన్య వంతంగా ఆహ్లాదకర వాతావర ణంలో నేర్చుకుంటారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల లో మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని వారు అన్నారు. విద్యార్థిని, విద్యార్థులు ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం, (ఎంఈఓ కే నాగేశ్వరరావు), ఉపాధ్యాల సిబ్బంది, విద్యార్థులు, సి ఆర్ పి సిబ్బంది పాల్గొన్నారు.



## అసమానతలు లేని దేశాన్ని చూడాలి

**నారాయణపేట, విశాలభారతి:**

జిల్లా కేంద్రంలో జరిగిన 3వ అంబేద్కర్ జాతరలో భాగంగా అధ్యక్షుడు మహేష్ ప్రధాన కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో బహుజన యుద్ధ నౌక ఏపూరి సోమన్న, పాలమూరు యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్ బైరెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ బహుజన సామ్రాజ్యం స్థాపించడమే గాక అంబేద్కర్ చూపించిన బౌద్ధ ధమ్మ మార్గంలో చేరి అందరూ బౌద్ధాన్ని తెల్సుకుని, అసమానతలు లేని దేశాన్ని చూడటం మనందరి లక్ష్యంగా చూడటమే మన ధ్యేయం గా సాధించాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు రకాల దళితుల సంఘాలు పాల్గొనటం జరిగింది. నాయకులు చిన్నయ్య, చంద్రకాంత్, ఫర్జానా, నాగమ్మ , ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



## వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ని సన్మానించిన సందగళ్ళ విజయ సతీష్ గౌడ్

**చౌటుప్పల్, విశాలభారతి:**

మండల కేంద్రంలోని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్గా ఎన్నికైన ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ గా ఎన్నికైన ఆకుల ఇంద్రసేనారెడ్డి మరియు 14వ వార్డు నుండి వ్యవసాయ మార్కెట్ సభ్యులుగా ఎన్నికైన పబ్బు శ్రీకాంత్ గౌడ్ ని మరియు ఇతర సభ్యులందరినీ 14వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ సందగళ్ళ విజయ సతీష్ గౌడ్ వారికి శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సన్న బియ్యం పథకంతో ప్రతిపక్షాలకు మింగుడు పడటం లేదు

- **జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్**

**ఎల్బినగర్ , విశాలభారతి:**



సన్న బియ్యం పథకంతో రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలకు మింగుడు పడటం లేదని జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్ భూపేష్ గుప్తా నగర్ కు చెందిన లలిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన సన్న బియ్యంతో వండిన భోజనాన్ని తినాలని ఆహ్వానించిన మేరకు అక్కడికి వెళ్లి భోజనం చేసినట్లు తెలిపారు రాష్ట్రంలోని పేదలందరూ ఒకే రకమైన సన్నబియ్యం తినాలని ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి అందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు సుజాత నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలో రేవంత్ రెడ్డి ఇచ్చిన సన్న బియ్యంతో సంతోషంగా భోజనం చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,రాజు గౌడ్, మమతా మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు




## బైల్పాటి రవీందర్‌కు దళిత రత్న అవార్డు

**సికింద్రాబాద్, విశాలభారతి:**

సీతాఫల్ మండికి చెందిన బైల్పాటి రవీందర్ కు దళిత రత్న అవార్డు లభించింది. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా రవీంద్రభారతి లో రాష్ట్ర ప్రభుత్వం తరపున తలపెట్టిన కార్యక్రమంలో ఆయన అందుకున్నారు. గురు వారం సీతాఫల్మండిలో టిఆర్ఎస్ పార్టీ నాయకుడు తూర్పాటి శివకుమార్, లంబు కుమార్ల ఆధ్వర్యంలో రవీందర్ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇటిక రాజు, కాశీ తదితరులు పాల్గొన్నారు.



## సంక్షేమ కార్యక్రమాల అమల్లో కాంగ్రెస్ భేష్..

- **సురేష్ నాయక్**

**విశాలభారతి, ఓయూ:**

కాంగ్రెస్ ప్రభు త్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామీణ స్థాయిలోకి వెళ్లడం లేదని, సంక్షేమ పథకాలను గ్రామీణ స్థాయిలో తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని గిరిజన విద్యార్థి నాయకుడు సురేష్ నాయక్ అన్నారు. గురువారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో సురేష్ నాయక్ మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ సంవత్సర కాలంలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. 53 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. సంక్షేమ పథకాలు గ్రామీణ స్థాయిలోని ప్రజలకు చేరడం లేదని సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42% రిజర్వేషన్‌ల అంశంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు తాము కూడా భాగస్వామి అవుతామని ప్రజా ప్రభుత్వానికి మద్దతు తెలుపుతామన్నారు. రాష్ట్రాన్ని గత ప్రభుత్వం ఆర్థికంగా దివాళా తించిన ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలు తీరుస్తున్న గొప్ప విశ్వసనీయత, విజ్ఞత, గల ప్రభుత్వం అని సురేష్‌నాయక్ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు గిరిజన విద్యార్థులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



## కీసరలో విధి లైట్లు ఏర్పాటు చేయాలి

**కీసర,విశాలభారతి :**

కీసర ప్రధాన చౌరస్తా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కూడలిలో సుమారు మూడు నెలల నుండి హైమాస్ లైట్ అలాగే వీధిలైట్లు లేక చీకట్లో అంధకారంలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.ప్రధాన చౌరస్తా ఉండటంతో అలాగే అన్ని గ్రామాలలో కొన్ని ఏరియాలో లైట్లు లేక ప్రజలకు వాహన దారులకు ఇబ్బందులు పడుతున్నారు. కావున వెంటనే లైట్లు ఏర్పాటు చేసి పరిష్కారం చేయాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణికి వినతిపత్రం ఇచ్చిన కీసర మండలం అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కొమ్ము సుదర్శన్,ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్,కోశాధికారి కానుకుంట శ్యామ్ కుమార్,సంయుక్త కార్యదర్శి కట్ట శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక




# అప్పుడు మామ.. ఇప్పుడు అల్లుడు..



మొన్న మామయ్యతో బ్లాక్ బస్టర్ సక్సెస్ సాధించిన ఆ హీరోయిన్.. ఇప్పుడు అల్లుడు సరసన నటిస్తోంది. మరో హిట్ కొట్టేందుకు సిద్ధమవుతోంది. ఆమె ఎవరో కాదు మీనాక్షీ చౌదరి. విక్టరీ వెంకటేష్ హీరోగా నటించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో 2025ను సక్సెస్ ఫుల్ గా స్టార్ట్ చేసిన అమ్మడు.. నాగచైతన్య అప్ కమింగ్ మూవీలో హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే మామాఅల్లుళ్లతో వెంటవెంటనే స్క్రీన్ షేర్ చేసుకున్న హీరోయిన్స్ లో మీనాక్షీ చౌదరి ఒకరు. అదే సమయంలో నాగచైతన్య రీసెంట్ గా తండేల్ తో ఎలాంటి హిట్ అందుకున్నారో అందరికీ తెలిసిందే. శ్రీకాకుళానికి చెందిన కొందరు మత్స్యకారుల నిజజీవితంలో జరిగిన సంఘటనల ఆధారంగా చందూ మొండేటి తెరకెక్కించిన ఆ మూవీతో రూ.100 కోట్ల విజయాన్ని సాధించారు. దీంతో ఇప్పుడు చైతూ అప్ కమింగ్ ప్రాజెక్ట్ NC 24పై అందరి ఫోకస్ పడింది. కొంత కాలం క్రితం రిలీజ్ అయిన విరూపాక్షతో ప్రేక్షకులను మెప్పించిన యంగ్ డైరెక్టర్ కార్తీక్ దండుతో సినిమా చేయనున్నారు నాగ చైతన్య. ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడి ఉన్న మిస్టిక్ థ్రిల్లర్ గా.. గ్రాండ్ గా సినిమా రూపొందనున్నట్లు కొద్ది రోజుల క్రితం వార్తలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. సినిమాలో చైతన్య రెండు కోణాలు ఉన్న రోల్ లో కనిపించనున్నారని తెలుస్తోంది. ఫుల్ గా మేకోవర్ చేసుకోనున్నారని సమాచారం. దీంతో కెరీర్ లో నెవ్వర్ బిఫోర్ పాత్రలో నటించనున్నారని వినికిడి. ఆయన సినీ కెరీర్ లోనే భారీ బడ్జెట్ సినిమా కానుందని, గ్రాఫిక్స్ పనుల కోసమే బడ్జెట్ లోని ఎక్కువ భాగం ఖర్చు చేయనున్నారని జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే విరూపాక్షలో తన దర్శకత్వ ప్రతిభ అంటే ఏంటో చూపించిన కార్తీక్ వర్మ.. పౌరాణికాలను, సస్పెన్స్ మిళితం చేసే మరో ఉత్కంఠభరితమైన థ్రిల్లర్ గా NC 24ను అందించాలనే ఆసక్తిగా ఉన్నారని సమాచారం. మొత్తానికి చైతూ NC 24పై ఇప్పటికే ఆడియన్స్ లో మంచి అంచనాలు ఉన్నాయి. త్వరలోనే మరిన్ని అప్డేట్స్ తో మేకర్స్ సందడి చేయనున్నారని తెలుస్తోంది. దీంతో సినిమా కోసం అంతా వెయిట్ చేస్తున్నట్లు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

# ప్రకృతిలో అందాల ప్రగ్యా



తమిళ్ మూవీ 'విరాట్టు'తో 2014లో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ ప్రగ్యా జైస్వాల్. తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఈమె మొదటి సినిమా కంచె అనుకుంటారు. కానీ అంతకు ముందు ఈమె మిర్చిలాంటి కుర్రాడు అనే సినిమాలో హీరోయిన్‌గా నటించింది. ఆ సినిమా విడుదల అయిన తర్వాతే క్రిష్ దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా నటించిన 'కంచె' సినిమాలో హీరోయిన్‌గా ఎంపిక చేశారు. కంచె సినిమా విడుదలైన వెంటనే ప్రగ్యా జైస్వాల్‌కి స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు దక్కింది. ఆ సినిమాలో అందంతో పాటు నటనతో మెప్పించడంతో రాబోయే కాలంలో కాబోయే స్టార్ హీరోయిన్ అంటూ చాలా మంది ప్రగ్యాను ఆకాశానికి ఎత్తారు. కానీ ఆమెకు కాలం కలిసి రాలేదు. కంచె సినిమా తర్వాత ప్రగ్యా జైస్వాల్ చాలా సినిమాలు చేసింది. కానీ పెద్ద విజయాలను మాత్రం సొంతం చేసుకోలేక పోయింది. ఒక వేళ సినిమాలు సక్సెస్ అయినా ఆమెకు పెద్దగా గుర్తింపు తెచ్చి పెట్టలేదు. మొత్తంగా ప్రగ్యా జైస్వాల్ ఇండస్ట్రీలో అడుగు పెట్టి పదేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్‌లను సొంతం చేసుకోలేదు, అంతే కాకుండా స్టార్ హీరోలకు జోడీగానూ సినిమాలో నటించే అవకాశాలు దక్కించుకోలేక పోయింది. సోషల్ మీడియాలో ఈమె రెగ్యులర్‌గా షేర్ చేసే ఫోటోల కారణంగా మంచి ఫాలోయింగ్‌ను సొంతం చేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈమెకు దాదాపుగా మూడు మిలియన్‌ల ఫాలోవర్స్ ఉన్నారు. దాంతో ఈమె ఏ ఫోటోలు షేర్ చేసినా వైరల్ అవుతున్నాయి. తాజాగా నేపాల్‌లోని ఖాట్మాండ్‌కి వెళ్లింది. అక్కడ తీసుకున్న ఫోటోలను షేర్ చేసింది. వైట్ టాప్‌ను ధరించి, బ్లూ టైట్ జీన్స్ ధరించిన ప్రగ్యా జైస్వాల్ మరోసారి ఆకట్టుకుంది. తన గత ఫోటో షూట్స్ మాదిరిగానే ఈ ఫోటోలతోనూ ప్రగ్యా చూపు తిప్పుకోనివ్వడం లేదు. అందమైన ప్రగ్యా జైస్వాల్ అందమైన ప్రకృతి మధ్య ఫోటోలు దిగితే లైక్ చేయకుండా ఎలా ఉంటాం అంటూ చాలా మంది ఈ ఫోటోలకు తెగ లైక్ చేస్తున్నారు. ఈమె ఫోటోలు షేర్ చేసిన కొన్ని గంటల్లోనే వేల కొద్ది లైక్స్ నమోదు అయ్యాయి. మీరు చాలా అందంగా ఉన్నారు అంటూ చాలా మంది కామెంట్స్ చేస్తూ ప్రగ్యా అందాలపై ప్రశంసలు కురిపిస్తూ కామెంట్ చేస్తున్నారు.



# ఆ టార్గెట్ రీచ్ అయినట్టే..!

న్యాచురల్ స్టార్ నాని హిట్ 3 మరో రెండు వారాల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. శైలేష్ కొలను డైరెక్షన్ లో హిట్ ఫ్రాంచైజీ సినిమాలు తెరకెక్కాయి. హిట్ ఫస్ట్ కేస్ విశ్వక్ సేన్ హీరోగా చేయగా అది సక్సెస్ అందుకుంది. ఆ తర్వాత హిట్ 2 అడివి శేష్ లీడ్ రోల్ లో చేయగా అది సూపర్ హిట్ కొట్టింది. హిట్ 3 కి కాస్త టైం తీసుకున్న శైలేష్ హిట్ థర్డ్ కేస్ తో ఈసారి నానిని అర్జున్ సర్కార్ గా చూపిస్తున్నాడు. హిట్ 3 ప్రచార చిత్రాలు నెక్స్ట్ లెవెల్ అనిపించేస్తున్నాయి. ముఖ్యంగా నాని లోని ఊర మాస్ విధ్వంసం బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి హంగామా చేస్తుంది అన్నది తెలియాల్సి ఉంది. సినిమా కథ ఎంపిక చేసుకోవడం నుంచి రిలీజ్ వరకు నాని కేవలం హీరోగానే కాదు అన్ని విధాలుగా తన బెస్ట్ ఇస్తూ వస్తాడు. ఐతే హిట్ 3 సినిమా విషయంలో నాని నిర్మాతగా కూడా మరింత ఫోకస్ తో పనిచేశాడు. హిట్ 3 సినిమాకు ఆడియన్స్ లో మంచి బజ్ ఏర్పడింది.నాని ఉన్నాడు కాబట్టి కచ్చితంగా ఆ పాజిటివ్ బజ్ ఉంటుంది. ఐతే హిట్ 3 నాని సినిమాల్లో చాలా ప్రత్యేకమైన సినిమాగా వస్తుంది. ఎందుకంటే నాని సినిమాల్లో ఈ రేంజ్ వైలెన్స్ ఇదివరకు ఏ సినిమాలో చూడలేదు. ఐతే హిట్ ఫ్రాంచైజీలో భాగంగా హిట్ 3 నాని ఊచకోత చూడబోతున్నామని ఫ్యాన్స్ ఫిక్స్ అయ్యారు. సినిమా సెట్స్ మీద ఉన్నప్పటి నుంచి ఆడియన్స్ ని ట్యూన్ చేస్తూ వచ్చిన నాని టీజర్, ట్రైలర్ తో అంచనాలు పెంచాడు.ఇక నెక్స్ట్ సినిమాను మే 1న ప్రేక్షకుల ముందుకు తెస్తున్నాడు. ఐతే నాని హిట్ 3 పై ఉన్న ఈ పాజిటివ్ బజ్ చూస్తుంటే కచ్చితంగా ఒక రేంజ్ లో హిట్ అందుకునేలా ఉంది. అంతేకాదు తెలుగుతో పాటు మిగతా భాషల్లో కూడా ఈ సినిమాకు మంచి రిలీజ్ లు దొరుకుతున్నాయి. అందుకే సరైన విధంగా క్లిక్ అయితే మాత్రం నాని హిట్ 3 పక్కా బ్లాక్ బస్టర్ అనిపించుకుంటుందని అంటున్నారు. ఇక కమర్షియల్ లెక్కల్లో చెప్పాలంటే హిట్ 3 సూపర్ హిట్ అనిపించుకుంటే మాత్రం 200 కోట్లు టచ్ చేసినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని తెలుస్తుంది. మరి నాని హిట్ 3 ఏమేరకు వసూళ్ల బీభత్సం సృష్టిస్తుందో చూడాలి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.